# 'వడ్డెర కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా రేణుక నియామకం అభ్యంతరం'



**ప్రజాపక్షం/హిమాయత్‌నగర్:** వడ్డెర కులస్థుల జీవన స్థితిగతులపై ఎలాంటి అవగాహన లేని గుంజ రేణుకను వడ్డెర కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా నియమించడం తీవ్ర అభ్యంతరమని తెలంగాణ వడ్డెర సంఘం అండ్ చారిటబుల్ ట్రస్టు రాష్ట్ర అధ్యక్షులు శివరాత్రి అయిలమల్లు పేర్కొన్నారు. 15 ఏళ్ల నుంచి వడ్డెర కులాల అభివృద్ధికి నిరంతరం పనిచేస్తున్న శివరాత్రి భిక్షంను వడ్డెర కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. వడ్డెర కులస్థుల అభ్యున్నతికి వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటుకు గత రెండున్నరేళ్ల నుంచి కాంగ్రెస్ మంత్రులను, ఎంఎల్‌ఎలను కలిసి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చామన్నారు. వడ్డెర కులాలు అభివృద్ధి చెందాలంటే శివరాత్రి భిక్షంను వడ్డెర కార్పొరేషన్ చైర్మన్‌గా నియమంచాలని కోరారు. తమ విజ్ఞప్తిపై ప్రభుత్వంపై 48 గంటల్లోగా స్పందించాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో సంఘం ఉపాధ్యక్షులు మంజల నగేశ్, కోశాధికారి గుర్రం శ్రీనివాస్, కార్యదర్శులు శంకర్‌రాజు, రామకృష్ణ, బోదాన నరసింహ, మక్కల వెంకన్న, కొడదల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## తలసేమియాపై అవగాహన

**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** ప్రపంచ తలసేమియా దినోత్సవం పురస్కరించుకుని నెక్లెస్ రోడ్డులోని హెచ్‌ఎండిఎ గౌండ్స్ నుంచి పీపుల్స్ ప్లాజా వరకు రెండు కిలోమీటర్ల మేరకు అవగాహన నడక జరిగింది. కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యే దానం నాగేందర్, డాక్టర్ అమన్, తలసేమియా సికిల్ సెల్ సొసైటీ వ్యవస్థాపకుడు రత్నావళి, సొసైటీ సభ్యులు, పెద్ద ఎత్తున యువత పాల్గొనడం జరిగింది.

## తలసేమియాపై అవగాహన వాక్



**ప్రజాపక్షం /హైదరాబాద్ :** 2035 నాటికి 'తలసేమియా రహిత భారత్' సాధించాలనే లక్ష్యంతో శుక్రవారం హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులో నిర్వహించిన రెండు కిలోమీటర్ల 'తలసేమియాసికిల్ సెల్ సొసైటీ' అవగాహన వాక్‌ను ఆరోగ్య శాఖ మంత్రి సి.దామోదర రాజనర్సింహ, ఎంఎల్‌ఎ డి.నాగేందర్ జెండా ఊపి ప్రారంభించారు. తలసేమియా నివారణ, ముందస్తు స్క్రీనింగ్, అందుబాటులో ఉండే ఆరోగ్య సంరక్షణ మద్దతు ప్రాముఖ్యత గురించి ప్రజలకు అవగాహన కల్పించడం అభినందనీయమని మంత్రి పేర్కొన్నారు. నిర్వాహకులు టిఎస్‌సిఎస్ ప్రెసిడెంట్ డాక్టర్ చంద్రకాంత్ అగర్వాల్, సిఇఒ, సెక్రటరీ డాక్టర్ సుమన్ జైన్, వైస్ ప్రెసిడెంట్ రత్నవల్లి కొత్తపల్లి, జాయింట్ సెక్రటరీ మిస్టర్ అలీమ్ బేగ్‌లు తలసేమియా, సికిల్ సెల్ వ్యాధి భారాన్ని తగ్గించడానికి క్రమం తప్పకుండా రక్త పరీక్షలు, జెనెటిక్ కౌన్సెలింగ్, ముందస్తు రోగ నిర్ధారణ ఎంత ముఖ్యమో వివరిస్తూ.. ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య సంరక్షణ నిపుణులు, తలసేమియా బాధితులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## 'ఫెర్నాండెజ్' లో మదర్స్ డే వేడుకలు ప్రారంభం



**ప్రజాపక్షం /హైదరాబాద్ :** మాతృ దినోత్సవం సందర్భంగా ఈ నెల 10న ఫెర్నాండెజ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో 'ఫెర్నాండెజ్ మదర్స్ డే ఫోటో కాంటెస్ట్ 2026' అనే వినూత్న ఆన్‌లైన్ ప్రచారాన్ని నిర్వహిస్తున్నట్టు ఫౌండేషన్ చైర్పర్సన్, ఎండీ డాక్టర్ ఎవిటా ఫెర్నాండెజ్ తెలిపారు. రెండురోజులు జరిగే మాతృదినోత్సవ వేడుకలను శుక్రవారం ప్రారంభించినట్టు పేర్కొన్నారు. నవజాత శిశువుతో ఉన్న తల్లి, తల్లితో ఉన్న పెద్దలు, అమ్మమ్మ ఆలింగనం లేదా తల్లి ప్రేమ స్ఫూర్తిని చాటిచెప్పే జ్ఞాపకాలను పంచుకోవడానికి ఆహ్వానిస్తున్నట్టు చెప్పారు. ఈ పోటీలో పాల్గొనేవారు ఇన్‌స్టాగ్రామ్ లేదా ఫేస్‌బుక్‌లో ఒక మంచి భావుకత ఉన్న ఫొటోను అప్‌లోడ్ చేసి, దానికి ఒక వ్యక్తిగత కథ లేదా శీర్షిక జతచేసి @fernandez.hospital ను ట్యాగ్ చేసి #Fernandez Celebrates Moms అనే క్యాంపెయిన్ హ్యాష్‌ట్యాగ్‌ను ఉపయోగించవచ్చని తెలిపారు. డిజిటల్ పోటీకి అనుబంధంగా ప్రత్యేకంగా రూపొందించిన 'మేడ్ విత్ లవ్' ఫోటో బూత్‌లను ఫెర్నాండెజ్ హాస్పిటల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసినట్టు వివరించారు. విజేతను ఈ నెల 15న ప్రకటిస్తామని తెలిపారు.

## చేనేత వస్త్ర ప్రదర్శన ప్రారంభం

**ప్రజాపక్షం/జూబ్లీహిల్స్:** శ్రీనగర్ కాలనీలోని శ్రీ సత్యసాయి నిగమాగమంలో చేనేత వస్త్ర ప్రదర్శనను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చేనేత రంగాన్ని పరిరక్షించి అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలుచేస్తున్నదన్నారు. నేటి ఆధునిక ప్రపంచంలో మిల్లు/మర మగ్గాల వస్త్రాలతో పోటీకి చేనేత వస్త్రాలు నిలబడలేకపోతున్నాయని తెలిపారు. పోచంపల్లి, గద్వాల, నారాయణ పేట, సిద్ధిపేట, గొల్లబామ, వరంగల్, కరీంనగర్ డ్రెస్, బెడ్ షీట్లు మొదలైన రకాల వస్త్రాలను ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం చేనేత వస్త్ర ప్రదర్శన శ్రీనగర్ కాలనీలోని సత్యసాయి నిగమాగమం ఏర్పాటు చేసిందన్నారు. ఈ నెల 17 వరకు ప్రతి రోజు సాయంత్రం ఐదు గంటల వరకు ఈ ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

## కారులో వచ్చి ఇంట్లో చోరీ

**ప్రజాపక్షం/సిటీబ్యూరో:** చోరీలకు డాబూ దర్పంతోనే దొంగలు వస్తున్నారు. ఏకంగా కార్లలో వచ్చి దోచుకుని పోతున్నారు. ఇటువంటి ఘటనే వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇంటి యజమానురాలు విదేశాలకు వెళ్లడంలో ఇంట్లో దొంగలు పడిన ఉదంతమిది. అర్ధరాత్రి దాటిన తరువాత దొంగలు ఇంటి వెనుక భాగంలోని డోర్‌ను బద్దలు కొట్టి ఇంట్లోకి చొరబడి దాదాపు రూ.4 లక్షల విలువైన బంగారు, వెండి నగలతో పాటు నగదు దోచుకువెళ్లిని ఘటన ఈనెల 5న వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వచ్చే టివికాలనీలో చోటుచేసుకుంది. వివరాలలోకి వెళితే... డాక్టర్ లక్ష్మి కుమారి, వైఫ్ ఆఫ్ దివంగత డాక్టర్ వెంకటేశ్వరప్రసాద్.ఇటీవల ఆమె అమెరికాకు వెళ్లడం జరిగింది. రోజు వారిగా పనిమనిషి ఇంటిని శుభ్రం చేసి వెళ్తుంది. అయితే ఈనెల 6వ తేదీ ఉదయం ఇంటికి వెళ్లి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించారు.ఈ క్రమంలోనే పోలీసులకు సమాచారం అందించారు. 5వ తేదీ అర్ధరాత్రి దాటిన తరువాత 3.15 గంటల సమయంలో ఇద్దరు దొంగలు దర్జాగా కారులో వచ్చి ఇంటి వెనుకభాగంలోని డోర్‌ను బద్దలుకొట్టి ఇంట్లోకి ప్రవేశించారు.

## అర్బన్ ఛాలెంజ్ ఫండ్స్‌తో..

# నగరాభివృద్ధి పనులకు విస్తృత అవకాశాలు

### రాష్ట్ర మున్సిపల్ పరిపాలన శాఖ కార్యదర్శి డాక్టర్ టి.కె శ్రీదేవి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మున్సిపాలిటీలలో కేవలం సిసి, బిటి రోడ్ల నిర్మాణాలకే పరిమితం కాకుండా అర్బన్ ఛాలెంజింగ్ ఫండ్స్ ద్వారా అనేక నగరాభివృద్ధి పనులు చేపట్టే అవకాశాలు ఉన్నాయని రాష్ట్ర మున్సిపల్ పరిపాలన శాఖ కార్యదర్శి డాక్టర్ టి.కె శ్రీదేవి తెలిపారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్, ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల సివిల్ కాంట్రాక్టర్‌ల సదస్సు శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా తెలంగాణలోని వివిధ మున్సిపాలిటీల నుంచి వచ్చిన సివిల్ కాంట్రాక్టర్‌లతో సమావేశమైన డాక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ రాష్ట్రంలోని 276 మంది కాంట్రాక్టర్లకు ఏడు బ్యాచ్‌లలో నాణ్యత ప్రమాణాలు, ప్రణాళిక, డాక్యుమెంటేషన్, క్వాలిటీ కంట్రోల్, భద్రతా చర్యలపై శిక్షణ అందిస్తున్నామని చెప్పారు. మున్సిపాలిటీలలో రూ.15 కోట్లకు, మున్సిపల్ కార్పొరేషన్లలో రూ.40 కోట్లకు తగ్గకుండా పనులు చేపట్టే అవకాశాలు ఉన్నాయన్నారు. అమృత్, స్వచ్ఛ భారత్ మిషన్, టియుఎఫ్‌ఐడిసి, అర్బన్ ఛాలెంజింగ్ పథకాల కింద సుమారు రూ.28 వేల కోట్ల నిధులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అమృత్ పథకం కింద ఉన్న రూ.7 వేల కోట్లలో ఇప్పటివరకు రూ.2400 కోట్లు మాత్రమే ఖర్చయ్యాయని, వచ్చే మార్చి నాటికి మంచినీటి సరఫరా, సీవరేజ్ వ్యవస్థలు, పార్కులు, ఫ్లైఓవర్లు, వర్టికల్ గార్డెన్లు, ఫౌంటెన్లు, చెరువుల పునరుద్ధరణ, నగర సుందరీకరణ వంటి అనేక పనులు చేపట్ట వచ్చన్నారు. వరంగల్‌లో అర్బన్ ఛాలెంజింగ్ ఫండ్స్ ద్వారా రూ.5200 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజి పనులు చేపట్టినట్లు చెప్పారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించడంతో పాటు స్థానిక కార్మికులకు ఉపాధి కల్పించాలని సూచించారు. 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యాన్ని చేరుకోవాలంటే నగరాభివృద్ధి కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఇంజనీర్ ఇన్ చీఫ్ మహమ్మద్ జియావుద్దీన్ మాట్లాడుతూ కాంట్రాక్టర్ ఒకేసారి ప్లానర్, ఇంజనీర్, సేఫ్టీ ఆఫీసర్, ఫైనాన్షియల్ మేనేజర్ పాత్రలు పోషించాల్సి ఉంటుందన్నారు. ఇస్కీ డైరెక్టర్ డాక్టర్ జి. రామేశ్వర్ రావు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా వివిధ శాఖల అధికారులకు తమ సంస్థ ద్వారా శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్లను దుర్గం చెరువు ఇంజనీరింగ్ వర్క్స్, సిద్ధిపేట మున్సిపల్ కార్పొరేషన్ ప్రాంతాలకు తీసుకెళ్లి ప్రత్యక్ష అవగాహన కల్పించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ జి. కొండల్ రావు, ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ డివిజన్ హెడ్ అనితా అగర్వాల్, నాగమల్లేశ్వర్ రావు, ప్రకాష్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

# యువకుడి హత్య.. తీవ్ర ఉద్రిక్తత



**ప్రజాపక్షం/సికింద్రాబాద్:** యువకుడి హత్య ఘటన సీతాఫల్‌మండి ప్రాంతంలో ఉద్రిక్తతలకు దారితీసింది. గురువారం రాత్రి 9.30 గంటల సమయంలో హత్య చోటుచేసుకోగా.. ప్రేమించిన యువతి బంధువులే హత్య చేయించారని ఆరోపిస్తూ బాధితులు యువతి ఇంటి ముందు యవన్ మృతదేహంతో ఆందోళన చేపట్టారు. నిందితులను కఠినంగా శిక్షించాలని బాధితులు డిమాండ్ చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిస్థితులు చేయిదాటకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలోనే ఆందోళనకారులను పోలీసులు శాంతింప చేశారు. యువకుడి హత్య ఘటనపై అదనపు డిసిపి నరసయ్య స్పందిస్తూ.. నిన్న రాత్రి సుమారు 9:30 గంటల సమయంలో యవన్ అలియాస్ అఖిల్ అనే బీటెక్ థర్డ్ ఇయర్ చదువుతున్న యువకుడిని కొంతమంది దారుణంగా హత్య చేసినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించినట్లు చెప్పారు. అనంతరం కేసును అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఘటనకు సంబంధించిన అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోందని, అతి త్వరలోనే నిందితులను అదుపులోకి తీసుకుంటామని అదనపు డిసిపి నరసయ్య తెలిపారు. ప్రాంతంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కేసును చిలకలగూడ ఎసిపి శశాంక్‌రెడ్డి పర్యవేక్షణలో సిఐ ఓలేటి రామకృష్ణ, వారాసిగూడ సీఐ రాజేందర్ గౌడ్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నారు.

## టిడిఆర్ సర్టిఫికెట్ల సమర్పణ ప్రక్రియ సరళతరం

# 'బిల్డ్ నౌ' పోర్టల్‌లో భారీ మార్పులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** క్యూర్ అర్బన్ రీజియన్ పరిధిలో భవన నిర్మాణ అనుమతులను మరింత వేగవంతం చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దరఖాస్తుదారులు ఎదుర్కొంటున్న సాంకేతిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, బదిలీ చేయదగిన అభివృద్ధి హక్కులు(ట్రాన్స్‌ఫర్ డెవలప్‌మెంట్ రైట్స్ టిడిఆర్) వినియోగ ప్రక్రియలో కీలక మార్పులు చేసింది. 'బిల్డ్ నౌ' పోర్టల్‌లో టిడిఆర్ సర్టిఫికెట్ల సమర్పణ విధానంలో మార్పులు చేస్తూ కొత్త ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు టిడిఆర్ ఫ్లోర్‌లతో కూడిన భవన నిర్మాణ దరఖాస్తుల కోసం ప్రారంభ దశలోనే టిడిఆర్ సర్టిఫికెట్లను సమర్పించడం తప్పనిసరి కాగా, తాజా నిర్ణయంతో ఆ నిబంధనను సడలించారు. ఇకపై దరఖాస్తుదారులు ఫీజు చెల్లింపు దశలో ఈ సర్టిఫికెట్లను అప్లోడ్ చేసే అవకాశం కల్పించారు.ప్రభుత్వం తెలిపిన వివరాల ప్రకారం, భవన నిర్మాణ అనుమతుల మంజూరులో జరుగుతున్న జాప్యాలను తగ్గించడం, దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను మరింత సులభతరం చేయడం ఈ మార్పుల ప్రధాన ఉద్దేశ్యంగా స్పష్టం చేసింది. దీంతో దరఖాస్తుదారులకు సమయం ఆదా కావడంతో పాటు, అనుమతుల జారీ ప్రక్రియ వేగవంతం అవుతుందని అధికారులు భావిస్తున్నారు. ఇక టిడిఆర్ సర్టిఫికెట్ల ధృవీకరణ విషయంలో ప్రభుత్వం కఠిన నిబంధనలు అమలు చేయనుంది. సంబంధిత అనుమతి పత్రాలపై సంతకం చేసే అధికారితో పాటు, ఆయనకంటే పైస్థాయి అధికారి కూడా ఈ సర్టిఫికెట్లను తప్పనిసరిగా తనిఖీ చేసి ధృవీకరించాల్సి ఉంటుంది. దీంతో పారదర్శకత పెరిగి, లోపాల నివారణకు అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఈ మార్పులకు అనుగుణంగా 'బిల్డ్ నౌ' పోర్టల్‌లో అవసరమైన సాంకేతిక మార్పులు చేపట్టాలని ప్రభుత్వం టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ విభాగం డైరెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసింది. కొత్త విధానం తక్షణమే అమల్లోకి రానుంది.

# లాంబాడాల పట్ల కెసిఆర్‌కు చిన్న చూపు

### కెటిఆర్ రాజకీయాలకు పనికిరారు: మాజీ ఎంపి బలరాం నాయక్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** లాంబాడాల పట్ల మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావుకు చిన్నచూపు ఉందని మాజీ ఎంపి బలరాం నాయక్ పేర్కొన్నారు. హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ లాంబాడా వర్గానికి చెందిన వ్యక్తిని కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ అభ్యర్థిగా నిలబెట్టినప్పుడు ఉద్దేశపూర్వకంగా బిఆర్‌ఎస్ ఓడించిందని విమర్శించారు. తెలంగాణ ఉద్యమంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి వర్గాల ప్రజలు పోరాడితే, ఫలితాలను మాత్రం కెసిఆర్ కుటుంబం అనుభవించిందన్నారు. రాష్ట్రాన్ని ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టింది కెసిఆర్ ప్రభుత్వమేనని ఆరోపించారు. కెటిఆర్ రాజకీయాలకు, రాష్ట్రానికి పనికిరారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించబోమని హెచ్చరించారు. కెటిఆర్ మరోసారి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే తగిన విధంగా స్పందిస్తామని, ఆయన అవినీతి వ్యవహారాలను ప్రజల ముందుకు తీసుకొస్తామని బలరాం నాయక్ పేర్కొన్నారు. ప్రజల సమస్యలను విస్మరించి రాజకీయ విమర్శలకే పరిమితమవుతున్నారని ఆయన మండిపడ్డారు.

# పాతపద్ధతిలో ఫీజులివ్వకుంటే హైదరాబాద్ దిగ్బంధిస్తాం

- అగ్రకుల సిఎంలతో బిసిలకు తీరని అన్యాయం
- బిసిల రాజ్యాధికారమే లక్ష్యంగా ముందుకెళ్తాం
- బిసి విద్యార్థి, యువజన సదస్సులో జాజుల శ్రీనివాస్‌గౌడ్



**ప్రజాపక్షం/హిమాయత్‌నగర్:** బడుగు,బలహీన వర్గాల పేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం తెచ్చిన ఫీజురీయింబర్స్‌మెంట్ స్కీంను పాతపద్ధతిలో అమలు చేయాలని, లేనిపక్షంలో జూన్‌లో హైదరాబాద్‌ను దిగ్బంధిస్తామని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఫీజులివ్వకుండా విద్యార్థులతో ప్రభుత్వం చెలగాటమాడుతుందని మండిపడ్డారు. శుక్రవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బిసి విద్యార్థి యువజన రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా జాజుల శ్రీనివాస్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. గత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కంటే ప్రత్యేక రాష్ట్రం లోనే బిసిలకు ఎక్కువగా అన్యాయం జరుగుతుందన్నారు. తెలుగు రాష్ట్రాలు విడిపోయిన తర్వాత బిసిల పరిస్థితి పెనం మీద పొయ్యిలో పడ్డ చందంగా తయారైందన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంకోసం శ్రీకాంతాచారి నుంచి సిరిపురం యాదయ్య వరకు బిసి బిడ్డలు ప్రాణాలర్పించారని ఆవేదన వ్యక్తం చేశారు. కానీ, ముఖ్యమంత్రి పీఠాల మీద అగ్రకులాలు కూర్చుని బిసిలకు తీరని అన్యాయం చేస్తున్నారని ధ్వజమెత్తారు. బిసిలను విస్మరించే రాజకీయ పార్టీలను2029 నాటికి గోరి కడతామని హెచ్చరించారు. నేపాల్ జెన్ జీ ఉద్యమ తరహాలో బిసి విద్యార్థి, యువత జట్టు గట్టి రాజ్యాధికారం లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా గోద వరుణ్ కుమార్ , గ్రేట్ హైదరాబాద్ బిసి విద్యార్థి సంఘం కార్యదర్శిగా వి.మణికంఠ, ఉపాధ్యక్షులుగా జే. జస్వంత్.ఎల్బీనగర్ జోన్ కార్యనిర్వాహక అధ్యక్షులుగా సిహెచ్ జయరాం, నాగోల్ జోన్ కార్యవర్గ అధ్యక్షులుగా సిహెచ్ ప్రశాంత్‌లను నియమించారు. సమావేశంలో బిసి కులాల సంఘం జెఎసి చైర్మన్ కుందారపు గణేశాచారి, సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్, బిసి విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్,యువజన అధ్యక్షులు కనకాల శ్యాం, గూడూరు భాస్కర్, బ్రహ్మాచారి, శ్రీనివాస చారి తదితరులు పాల్గొన్నారు.

# మోదీతోనే చట్టసభల్లో రిజర్వేషన్లు సాధ్యం



### కులగణన తర్వాత బిసిలకు అన్ని రంగాల్లో వాటా
### మీడియా సమావేశంలో ఎంపి ఆర్.కృష్ణయ్య

**ప్రజాపక్షం / హిమాయత్‌నగర్ :** ప్రధాని మోదీ చారిత్రాత్మక నిర్ణయమైన జనగణనలో కులగణన తప్పక జరిగి తీరుతుందని జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపి ఆర్.కృష్ణయ్య అన్నారు. కులగణన తర్వాతే ప్రధాని మోదీ చట్టసభల్లో బిసిలకు జనాభా ప్రకారం విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో రిజర్వేషన్లు తెస్తారని, అందులో అనుమానం లేదన్నారు. శుక్రవారం హైదరాబాద్ కాచిగూడలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం వెంకటేశ్, బిసి సంఘం అధ్యక్షులు సి.రాజేందర్, బిసి విద్యార్థి సంఘం కన్వీనర్ మోదీ రాందేవ్ సంయుక్త అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశానికి ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం బిసిల వ్యతిరేక పార్టీ అని కొన్ని రాజకీయ పార్టీలు ప్రచారం చేయడాన్ని కృష్ణయ్య ఖండించారు. బిజెపి తప్ప బిసిలకు ఏ ప్రభుత్వం న్యాయంచేయలేదన్నారు. బిసి ప్రధానిగా మోదీ బిసి వర్గానికి చెందిన 27 మందికి కేంద్రమంత్రులు, నలుగురికి గవర్నర్ పదవులు, ఐదుగురికి సిఎం పదవులిచ్చారని, సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌గా ఒక దళితున్ని చేశారని తెలిపారు. బిజెపి ప్రభుత్వంతోనే నిరుద్యోగులు, పేదల సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. 10న బిజెపి బహిరంగ సభకు హాజరయ్యే ప్రధాని మోదీకి ఘన స్వాగతం పలకాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బిసి సంఘం నేతలు అంజి గౌడ్, నిఖిల్ పటేల్, తిరుమలగిరి, అశోక్, బలరాం, మల్లేశ్ యాదవ్ , రాములు తదితరులు పాల్గొన్నారు.

## సిఎంకు కృతజ్ఞతలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలో కురుమల అభ్యున్నతికి కురుమ కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి టిపిసిసి కోఆర్డినేటర్ అచ్చిన అయిలయ్య శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. కురుమలు విద్య, రాజకీయ, ఆర్థిక రంగాల్లో వెనుకబడి ఉన్నారన్నారు. కార్పొరేషన్ ఏర్పాటు ద్వారా సమాజానికి ఆత్మస్థైర్యం కలిగిందన్నారు. ఈ విషయంలో కీలక పాత్ర పోషించిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సంచార జీవితం కొనసాగిస్తూ గొర్రెల పెంపకంతో జీవిస్తున్న కురుమల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఉపయోగపడుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి కురుమ సమాజం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు.

## ఎంఎంసి పరిధిలో నాలాల పూడికతీత – అక్రమణల తొలగింపు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసి) ఆధ్వర్యంలో శుక్రవారం నాలాల పూడికతీత, అక్రమణల తొలగింపు కార్యక్రమాలు నిర్వహించారు. వర్షాకాలానికి ముందస్తు చర్యల్లో భాగంగా నాలాల్లో పేరుకుపోయిన పూడికను తొలగించి, నీటి ప్రవాహం సాఫీగా జరిగేలా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా 1.56 కిలోమీటర్ల మేర నాలాల డిసిల్టింగ్ పనులు పూర్తి చేశారు. నాలాలపై అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిని గుర్తించి నోటీసులు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. భవిష్యత్తులో వరద ముప్పు నివారణ లక్ష్యంగా చర్యలు కొనసాగిస్తున్నామని స్పష్టం చేశారు. ప్రజల సహకారంతో నగరాన్ని పరిశుభ్రంగా, సురక్షితంగా తీర్చిదిద్దేందుకు ఎంఎంసి కట్టుబడి ఉందన్నారు.

## సికింద్రాబాద్ కుల దురహంకార హత్య అత్యంత కిరాతకం

### నిందితులను కఠినంగా శిక్షించాలి :సిపిఐ(ఎం) డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కులాంతర వివాహానికి సిద్ధపడ్డారనే నెపంతో సికింద్రాబాద్‌లోని సీతాఫల్‌మండిలో బిటెక్ విద్యార్థి యావన్‌ను దుండగులు అత్యంత దారుణంగా, కిరాతకంగా హత్య చేయడాన్ని సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తోందని రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. బాధిత కుటుంబానికి ఆయన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. యావన్‌ను పక్కా పథకం ప్రకారం సభ్య సమాజం తలదించుకునే విధంగా వేటకొడవళ్లతో దాడి చేసి చంపడం దారుణమని, నగర నడిబొడ్డున ఇలాంటి దాడులు జరగడం శోచనీయమని ఆయన పేర్కొన్నారు. తక్షణమే నిందితులందరినీ వెంటనే అరెస్ట్ చేసి, ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా కఠినంగా శిక్షించాలని,మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వంఅన్ని విధాలుగా ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కాంగ్రెస్, ఐఎన్‌టియుసి నేతలు జన్మదిన శుభాకాంక్షలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కాంగ్రెస్, ఐఎన్‌టియుసి నేతలు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మినిస్టర్స్ క్వార్టర్స్‌లో శుక్రవారం అయన పుట్టినరోజు ను పురస్కరించుకొని మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి ఐఎన్‌టియుసి తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షులు మొగుళ్ళ రాజిరెడ్డి, డిసిసి అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డి, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ తదితరులు పొన్నం ప్రభాకర్‌కు శాలువా, పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సన్మానించారు.

# రేణిగుంట-అగర్తాల మధ్య పార్సిల్ కార్గో ఎక్స్‌ప్రెస్ ప్రారంభం

### -సరుకురవాణాకు కొత్త దారి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దక్షిణ మధ్య రైల్వే సరుకు రవాణా రంగంలో మరో కీలక అడుగు వేసింది. గుంతకల్ డివిజన్ ఆధ్వర్యంలో రేణిగుంట–అగర్తాల మధ్య పార్సిల్ కార్గో ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభిస్తూ దేశవ్యాప్తంగా వ్యాపార, వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు కొత్త దారులు తెరిచింది. రేణిగుంట రైల్వే స్టేషన్ నుంచి శుక్రవారం ఈ సేవను ప్రారంభించారు. ఈ ప్రత్యేక రైలు ద్వారా ఫాస్ట్ మూవింగ్ కన్స్యూమర్ గూడ్స్ (ఎఫ్‌ఎంసిజి)తో పాటు వ్యవసాయ ఉత్పత్తులను దీర్ఘదూరాలకు వేగంగా, తక్కువ ఖర్చుతో తరలించే అవకాశం కలుగుతుంది.ఇటీవలి కాలంలో రాయలసీమ ప్రాంతంలో, ముఖ్యంగా రేణిగుంట పరిసరాల్లో వ్యవసాయ ఉత్పత్తులు విస్తృతంగా పండుతున్నాయి. అయితే, వాటిని దూర ప్రాంతాలకు రోడ్డు మార్గంలో తరలించడం ఖర్చుతో కూడుకున్నదిగా, సమయపరంగా ఆలస్యం కలిగించేదిగా మారింది. ఈ సమస్యకు పరిష్కారంగా గుంతకల్ డివిజన్ 6 సంవత్సరాల కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఈ పార్సిల్ కార్గో ఎక్స్‌ప్రెస్ సేవను ప్రారంభించింది.ప్రారంభ రన్‌లో సుపారి (బెటెల్ నట్స్), అగర్బత్తులు, చాక్లెట్లు, 'ఆల్ అవుట్' లిక్విడ రీఫిల్స్ వంటి వస్తువులను రవాణా చేశారు. భవిష్యత్తులో మిర్చి, టైర్లు, ఐటిసి ఉత్పత్తులు, కాడ్బరీ కాన్ఫెక్షనరీలు, కిమ్బర్లీ క్లార్క్ ఉత్పత్తులు, పెర్ఫెట్టి వంటి ప్రముఖ కంపెనీల సరుకులు కూడా ఈ మార్గంలో తరలించే అవకాశముందని అధికారులు తెలిపారు. ఈ కార్గో రైలు ద్వారా దక్షిణ భారతదేశం నుంచి కోల్‌కతా, గువాహటి, సిల్చర్, అగర్తల వంటి ప్రధాన వాణిజ్య కేంద్రాలకు వేగవంతమైన అనుసంధానం ఏర్పడనుంది. దీని ద్వారా దేశవ్యాప్తంగా సరుకు రవాణా వ్యవస్థ మరింత బలోపేతం కానుంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా మొత్తం కాంట్రాక్ట్ కాలంలో సుమారు రూ.54 కోట్ల ఆదాయం వచ్చే అవకాశముందని అంచనా వేస్తున్నారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ఈ సేవ ప్రారంభాన్ని అభినందిస్తూ, ఇది రైల్వే ఫ్రైట్ వ్యాపారాన్ని విస్తరించడంలో కీలక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. వ్యాపారవేత్తలు, పరిశ్రమలకు ఇది నమ్మదగిన మరియు చవకైన రవాణా మార్గంగా ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు.

# కృష్ణానగర్ వరద సమస్యకు శాశ్వత పరిష్కారం

## క్షేత్రస్థాయిలో ఎమ్మెల్యే, జిహెచ్ఎంసి, హైడ్రా కమిషనర్ల పరిశీలన



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వర్షాకాలంలో కృష్ణానగర్, యూసుఫ్‌గూడ ప్రాంత వాసులను వేధిస్తున్న వరద సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా అధికారులు అడుగులు వేస్తున్నారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, హైడ్రా కమిషనర్ ఏ.వి.రంగనాథ్ శుక్రవారం ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి, పరిస్థితిని సమీక్షించారు. వర్షం పడితే రోడ్లు జలమయం కావడం, మురుగునీరు ఇళ్లలోకి చేరడం వంటి సమస్యలపై స్థానికులు అధికారులకు మొరపెట్టుకున్నారు. దీనిపై స్పందించిన కమిషనర్లు, కాలువల్లో పేరుకుపోయిన పూడికను వెంటనే తొలగించాలని ఇంజనీరింగ్, పారిశుద్ధ్య విభాగాలను ఆదేశించారు. జూబ్లీహిల్స్, వెంకటగిరి వంటి ఎగువ ప్రాంతాల నుండి వచ్చే మట్టి, చెత్త కారణంగా కాలువల్లో 6 నుండి 7 అడుగుల మేర పూడిక పేరుకుపోయింది. కాలువలు 8 నుండి 9 అడుగుల లోతులో ఉండటంతో పనులకు ఆటంకం కలుగుతోంది. అవసరమైన చోట స్లాబులను తొలగించి క్లీన్ చేయాలని నిర్ణయించారు. పూడికతీత తర్వాత ప్రమాదాలు జరగకుండా కాలువలపై బలమైన ఐరన్ గ్రిల్స్ ఏర్పాటు చేయనున్నారు.

**నెల రోజుల్లో మార్పు కనిపిస్తుంది : హైడ్రా కమిషనర్**

మీడియాతో మాట్లాడిన హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్ కృష్ణానగర్ ప్రజలకు వరద నుండి ఉపశమనం కలిగిస్తామన్నారు. 2021 తర్వాత ఇక్కడ సరైన డీసిల్టింగ్ జరగలేదని గుర్తించామని, అందుకే ఈసారి వేసవిలోనే పనులు మొదలుపెట్టామన్నారు. నాలాలపై నిర్మించిన ఇళ్లకు నోటీసులు ఇచ్చి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని రంగనాథ్ స్పష్టంచేశారు. స్థానిక ఎమ్మెల్యే నవీన్ యాదవ్ చొరవతో, ప్రస్తుతం ఉన్న కాలువపై ఒత్తిడి తగ్గించేందుకు ప్రత్యామ్నాయ వరద కాలువ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు.

### అక్రమ మైనింగ్, క్రషర్లపై సమాచారం ఇవ్వండి : హైడ్రా కమిషనర్ విజ్ఞప్తి

హైదరాబాద్ పరిసరాల్లో పర్యావరణానికి ముప్పు కలిగిస్తున్న అక్రమ మైనింగ్, క్రషర్లు, ఆర్ఎంసి, ఓఆర్ఆర్ పరిసర ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్లాంట్ల సమాచారాన్ని 9000113667 నెంబర్‌కు వాట్సాప్ చేయాలని హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ కోరారు. ప్రజలు తమ ప్రాంతాల్లోని అక్రమ మైనింగ్ ఫొటోలు, లొకేషన్‌ను షేర్ చేస్తే వెంటనే వాటి అనుమతులను పరిశీలించి కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. నగర పర్యావరణ రక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలని రంగనాథ్ విజ్ఞప్తి చేశారు.

## రోడ్డు విస్తరణ పనులు వేగవంతం

### సిఎంసి కమిషనర్ సృజన




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భూసేకరణ అడ్డంకులను తొలగించి రోడ్డు విస్తరణ పనులను వేగవంతం చేయాలని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(సిఎంసి) కమిషనర్ సృజన అధికారులను ఆదేశించారు. ప్రతి పని నిర్దేశించిన గడువులో పూర్తి కావాలని స్పష్టం చేశారు. సిఎంసి ప్రధాన కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ విభాగం పనులపై కమిషనర్ సృజన సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో సిటీ చీఫ్ ప్లానర్ బి.వెంకన్న, మూడు జోన్‌ల సిటీ ప్లానర్లు, జోనల్ బృందాలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. భవన నిర్మాణ అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికేట్లు, టిడిఆర్, ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను కమిషనర్ సమీక్షించారు. శిథిలావస్థకు చేరిన ప్రమాదకర భవనాలపై తీసుకుంటున్న చర్యలను పరిశీలించిన కమిషనర్, ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. పెండింగ్ దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, లీగల్ విభాగాల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయాలని ఆదేశించారు. ఆక్రమణల తొలగింపు డ్రైవ్‌లను ముమ్మరం చేసి, పౌరులకు పారదర్శక సేవలు అందించాలన్నారు. పౌర సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రభావం చూపుతుందని కమిషనర్ హెచ్చరించారు.

## అభివృద్ధి పనుల్లో పారదర్శకతకు క్యూఆర్ కోడ్

### ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అభివృద్ధి పనుల్లో పారదర్శకత కోసం క్యూఆర్ కోడ్ ఆధారిత వ్యవస్థను అమలు చేస్తున్నట్లు మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసి) కమిషనర్ టి.వినయ్ కృష్ణా రెడ్డి తెలిపారు. వనస్థలిపురంలో శుక్రవారం అధికారులు, సిబ్బందితో కలిసి పర్యటించిన ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. వార్డు కార్యాలయం, లైబ్రరీ హాల్, యోగా సెంటర్, కాలనీ పార్క్ వంటి కమ్యూనిటీ సదుపాయాలను తనిఖీ చేసిన కమిషనర్‌కు కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు మోడల్ మార్కెట్‌లో దుకాణం కేటాయించాలని వినతిపత్రం సమర్పించారు. ఎఫ్‌సిఐ కాలనీ పార్కులో నిర్వహించిన స్వీయ జనగణన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్, ప్రతి పౌరుడు స్వచ్ఛందంగా జనగణనలో పాల్గొనాలని కోరారు. పార్క్ అభివృద్ధి పనులను పరిశీలించి చిన్నారుల ఆట పరికరాలు, పచ్చదనం పెంపుపై చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వరద నీటి కాలువ పనులను సమీక్షించిన ఆయన, క్యూఆర్ కోడ్ ఆధారిత పారదర్శక వ్యవస్థ ద్వారా కాంట్రాక్ట్ వివరాలు, బడ్జెట్, పనుల గడువు, ఇంజనీరింగ్ అధికారుల వివరాలు ప్రజలకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. అలాగే దోమల నివారణ చర్యలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.





### స్వీయ జనగణనపై విస్తృత అవగాహన కార్యక్రమాలు

స్వీయ జనగణనపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసి) కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. తార్నాకలోని ప్రధాన కార్యాలయం నుంచి యుసిడి విభాగం అధికారులు, పిడిలతో నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలపై అధికారులను అడిగి తెలుసుకున్న కమిషనర్, స్లమ్ లెవల్ ఫెడరేషన్ సభ్యులు, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు ప్రజలకు సెల్ఫ్ ఎన్యూమరేషన్ విధానంపై అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. ఇంటింటికి వెళ్లి మొబైల్ యాప్ వినియోగంపై సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరూ స్వీయ జనగణనలో పాల్గొని సహకరించాలని కమిషనర్ పిలుపునిచ్చారు.

## సైబర్ కేసుల దర్యాప్తులో బ్యాంకుల సహకారం ముఖ్యం

### సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** సైబర్ కేసుల దర్యాప్తులో బ్యాంకుల సహకారం ముఖ్యం అని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం.రమేష్ అన్నారు. సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని వివిధ బ్యాంకుల ప్రతినిధులతో శుక్రవారం సిపి కార్యాలయ ఆడిటోరియంలో ప్రత్యేక సమన్వయ సమావేశం నిర్వహించారు. సమావేశంలో సైబర్ నేరాలకు సంబంధించిన కేసుల్లో బ్యాంకులు, పోలీసుల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడం ద్వారా దర్యాప్తును వేగవంతం చేయడం, ముఖ్యంగా మ్యూల్ అకౌంట్ల నియంత్రణ, ఖాతాల ఫ్రీజ్, డిఫ్రీజ్ ప్రక్రియలు, బాధితులకు నగదు వాపసు ఇవ్వడం, డిజిటల్ మోసాల విచారణపై సమావేశంలో ఫిర్యాదులపై త్వరిత గతిన స్పందించడానికి ప్రతి బ్యాంకులో "సైబర్ సెల్స్" ఏర్పాటు చేయాలని సిపి కోరారు. ప్రజలు కూడా పెట్టుబడులు పెట్టే ముందు వాస్తవాలను సరిచూసుకోవాలని, అనుమానాస్పద కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం అందించాలని, నేరగాళ్లకు సహకరించవద్దని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సైబరాబాద్ కుత్బుల్లాపూర్ డిసిపి కోటి రెడ్డి, క్రైమ్స్ డిసిపి ఏ.ముత్యం రెడ్డి,సైబర్ క్రైమ్స్ డిసిపి టి.సాయి మనోహర్, హెచ్‌డీఎఫ్‌సీ, బ్యాంక్ ఆఫ్ బరోడా, యాక్సిస్ బ్యాంక్, ఎస్‌బీఐ,ఐసీఐసీఐ,బ్యాంక్ ఆఫ్ ఇండియా,తెలంగాణ గ్రామీణ బ్యాంక్,హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్,కోటక్ మహీంద్రా బ్యాంక్ వంటి వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

## రైతు వారం కార్యక్రమంలో మత్స్య ప్రగతి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** భూగర్భ జలాలను పెంపొందించడం కోసం చెరువులు కుంటలను సౌరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంద ని ఇరిగేషన్, వ్యవసాయశాఖ అధికారులు అన్నారు. ప్రజాపాలన ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న "రైతు వారం" కార్యక్రమంలో శుక్రవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో మత్స్య ప్రగతి నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఇరిగేషన్, హార్టికల్చర్, భూగర్భ జల శాఖ అధికారులు, కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు మత్స్యకారులు,ఆక్వా రైతులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. చేపల చెరువులో కలుపు మొక్కల నివారణ, చెరువులలో చేపల వ్యాధులపై అవగాహన, నివారణ, తీసుకోవలసిన చర్యలు, చేపలను చెరువులలో పెంచు విధానం, చెరువులు కాలుష్యానికి గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలతోపాటు అక్రమణదారుల నుండి చెరువులను కాపాడుట, ఫిష్ కం హార్టికల్చర్‌లో భాగంగా సమీకృత విధానంలో చేపల పెంపకంపై రైతులకు సమగ్ర అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా ఇరిగేషన్ ఎస్ఇ శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారి డి.ఉష, జిల్లా హార్టికల్చర్ అధికారి కె సురేష్, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## నేపాలీ పని మనుషులతో తస్మాత్ జాగ్రత్త

### సిపి సజ్జనార్ హెచ్చరిక

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూబ్లీహిల్స్‌లో జరిగిన హత్య ఘటన అనంతరం నగర పోలీస్ కమిషనర్ విసి సజ్జనార్ ప్రజలకు కీలక హెచ్చరికలు జారీ చేశారు. నేపాల్‌కు చెందిన మనుషులను ఇంట్లో నియమించుకునే విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. విశ్రాంత ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రే భార్య హత్య కేసులో నేపాలీ పనిమనిషి పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఈ సూచనలు వెలువడ్డాయి. నిందితులు ప్లాన్ చేసి, సరైన సమయం చూసుకుని దాడి చేసి దోపిడీకి పాల్పడుతున్నారు. సిపి సజ్జనార్ మాట్లాడుతూ నేపాలీ గ్యాంగులు ఇళ్లలో పనిమనుషులుగా చేరి యజమానుల కదలికలను గమనిస్తూ, అనుకూల సమయాల్లో దోపిడీలు, హత్యలకు పాల్పడిన ఘటనలు వెలుగుచూస్తున్నాయని తెలిపారు. సరైన వెరిఫికేషన్ లేకుండా పనిమనుషులను నియమించడం ప్రమాదకరమని హెచ్చరించారు. ఇంట్లో పనిచేసే వ్యక్తులపై యజమానులు నిరంతరం నిఘా ఉంచాలని, వారి ఆధార్, ఫోటోలు, చిరునామా వంటి పూర్తి వివరాలను సమీప పోలీస్ స్టేషన్‌లో నమోదు చేయించి పోలీస్ వెరిఫికేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. వారు ఎవరితో సంబంధాలు కొనసాగిస్తున్నారు? ఎక్కడికి వెళ్తున్నారు? వంటి అంశాలపై జాగ్రత్తగా గమనించాలని చెప్పారు.

## పాడి పంటకు, రైతు ప్రగతికి పశువులు ముఖ్యం

### ప్రభుత్వరంగ సంస్థల రాష్ట్ర చైర్మన్ వీర్లపల్లి శంకర్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** పాడి పంటలకు, రైతు ప్రగతికి పశువులు ఎంతో ముఖ్యమని, అలాంటి పాడి పరిశ్రమ నిర్వహణ వ్యయం తగ్గించి శాస్త్రీయంగా రైతులు ముందుకు వెళ్ళినప్పుడే అభివృద్ధి సాధ్యమని ప్రభుత్వ రంగ సంస్థల చైర్మెన్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని పీర్లగూడ గ్రామంలో రైతు వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు. వివిధ శాఖల అధికారులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించి మాట్లాడుతూ పాడి పశువులను అభివృద్ధి చేసేందుకు రైతులు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో పీర్లగూడెం సర్పంచ్ షమీమ్ భేగం, ఉప్పరిగడ్డ సర్పంచ్ చందునాయక్, జిల్లా పశువైద్య, పశుసంవర్ధక శాఖ అధికారి శాఖ డాక్టర్ డి.శ్రీనివాస్‌రావు, జిల్లా పశుగణాభివృద్ధిశాఖ అధికారి డాక్టర్ ఎస్.అరుణశ్రీ, షాద్‌నగర్ ఎడి కె.విజయ్‌కుమార్‌రెడ్డి, మండల పశువైద్యాధికారి ముక్కంటి రాజు, కేశంపేట వైద్యాధికారి డాక్టర్ ఎన్.నివేధిత,, డాక్టర్ బి.జయసుద, నందిగామ వైద్యులు వంశీకృష్ణారెడ్డి, విఎల్ఓ శోభ, ఉపసర్పంచ్ సిద్దయ్య, నేతలు నవాజ్ గోరి, ఖాధర్‌గోరీ, హైదర్ గోరి, వార్డు సభ్యులు బుద్దుల జంగయ్య, ఇమ్రాన్ గోరి, పహిల్వాన్ గోరి పాల్గొన్నారు.



### రాహుల్‌గాంధీ, సిఎంపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హెచ్చరించారు. రైతులను ఆర్థికాభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంటే బిఆర్ఎస్ మాజీ మంత్రి కెటిఆర్ ఇష్టం వచ్చినట్లు వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదని హెచ్చరించారు. కెటిఆర్ మాటలను రాసేందుకు జర్నలిస్టులు సైతం సిగ్గుపడుతున్నారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతుల కోసం కృషి చేస్తుంటే విమర్శలు చేయడం కెటిఆర్ అవివేకానికే నిదర్శనమన్నారు.


## నకిలీ యజమానుల అవతారమెత్తి రూ.16లక్షల మోసం

### వివరాలు వెల్లడించిన షాద్‌నగర్ డిసిపి శిరీష
### ఇద్దరు నిందితుల అరెస్టు



**ప్రజాపక్షం/కొత్తూరు:** నిర్మాణంలో ఉన్న భవనాలకు తామే యజమానులమంటూ నమ్మించి రెడీమిక్స్ కాంక్రీట్ సరఫరా వ్యక్తులను బురిడి కొట్టించిన సంఘటన రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండల కేంద్రంతో చోటు చేసుకుంది. శుక్రవారం కొత్తూరు పోలీస్ స్టేషన్‌లో సిఐ నర్సయ్య ఆద్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశానికి షాద్‌నగర్ డిసిపి శిరీష హాజరై వివరాలను వెల్లడించారు. నిర్మాణంలో ఉన్న భవనాలను ఎంచుకొని తమ వద్ద రెడ్‌మిక్స్ కాంక్రీట్ ఉందని యాజమానులను నమ్మించి అడ్వాన్స్‌గా కొంత నగదు తీసుకుంటారని వివరించారు. మే 2న కమ్మరి రమేష్ అలియాస్ విశాల్ అనే వ్యక్తి సూర్య ప్రతాప్‌రెడ్డిని సంప్రదించి కొత్తూరులో తనకు ఓ భవనం ఉందని, దానికి కాంక్రీట్ కావాలని కోరాడు. తాను ఆ భవన యాజమాని అని నమ్మించి విశాల్ రూ.50వేలు అడ్వాన్స్ చెల్లించి కాంక్రీట్ ఆర్డర్ ఇచ్చాడు. మిగిలిన రూ.4,23,500లు పని పూర్తియ్యాక ఇస్తానని షాద్‌నగర్ చెందిన చెల్లా సూర్యప్రతాప్‌రెడ్డి రెడీమిక్స్ కాంక్రీట్ వ్యాపారి వద్ద ఒప్పందం చేసుకున్నాడు. తీరాపని పూర్తియ్యాక డబ్బులు అడగగా బ్యాంకు ద్వారా బదిలీ చేస్తానని చెప్పి ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు. అనుమానం వచ్చి బాధితుడు భవనం వద్దకు వెళ్ళి విచారించగా విశాల్ ఆ భవన యజమాని కాదని అసలు యజమాని నుండి విశాల్ అప్పటికే కాంక్రీట్ పనికి సంబంధించిన పూర్తి డబ్బును వసూలు చేసుకున్నాడని తెలిసి నిర్ఘాంతపోయాడు. దాంతో బాధితుడు చెల్లా సూర్యప్రతాప్‌రెడ్డి కొత్తూరు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వివరించారు. బాధితుడి ఫిర్యాదు ఆధారంగా దర్యాప్తు చేయగా మే 8న ఇన్ముల్‌నర్వ గ్రామంలో మరో మోసానికి కమ్మరి రమేష్, వేముల ప్రేమ్‌కుమార్‌లు రెడీ అవుతుండగా కొత్తూరు పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. నిందుతులు తామే యాజమానులమని చెప్పి రెడీమిక్స్ సరఫరాదారులను సంప్రదించేవారు, అడ్వాన్స్ ఇచ్చి కాంక్రీట్ వేయించే వారు, అనంతరం అసలు యాజమానుల నుంచి డబ్బులు వసూలు చేసుకొని సరఫరాదారులకు చెల్లించకుండా పరారయ్యేవారని డిసిపి తెలిపారు. ఇదే తరహాలో చేవెళ్ల, గజ్వేల్, చంద్రాయన్‌గుట్ట, గచ్చిబౌలి ప్రాంతాల్లో సుమారు రూ.16.50లక్షలు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. నింధితుల నుండి రూ.2.39 లక్షలు, ఒక కారు, ఒక ఐఫోన్‌తో సహా నాలుగు స్మార్ట్ ఫోన్లను స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డిసిపి శిరీష తెలిపారు. కేసును త్వరగా చేధించినందుకు పోలీస్ సిబ్బందిని డిసిపి శిరీష ప్రత్యేకంగా అభినంధించారు. సమావేశంలో సిఐ నర్సయ్యతోపాటు ఎస్ఐలు సత్యశీలా రెడ్డి, గోపాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** సిఎం రిలీఫ్ ఫండ్ పేద ప్రజలకు వరమని ఎల్‌బి నగర్ యువజన కాంగ్రెస్ నాయకులు జక్కిడి సత్య తేజ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులు సాహితికి ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.లక్ష 88వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ వైద్యం చేయించుకున్న పేదలను ఆర్థికంగా అదుకోవడానికి సిఎం రిలీఫ్ ఫండ్ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు నిషాత్ తదితరులు పాల్గొన్నారు.

## జోనల్ కమిషనర్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** ఎల్‌బి నగర్ జోనల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన వికాస్ మహంతోను శుక్రవారం వనస్థలిపురం డివిజన్ మాజీ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాశం అశోక్ గౌడ్, బియన్ రెడ్డి డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు గణేష్ రెడ్డిలు కమిషనర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డివిజన్‌లో పర్యటించి సమస్యలను గుర్తించి పరిష్కారం దిశగా ముందుకు సాగాలని కమిషనర్‌ను కోరారు. కార్యక్రమంలో హరేందర్‌రెడ్డి, వాసు తదితరులు ఉన్నారు.

## ఆడబిడ్డ పెండ్లికి సర్పంచ్ కానుక



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** ఆడబిడ్డ పెళ్ళికి సర్పంచ్ నాయక్ రూ.5116లు పెళ్ళి కానుకగా అందజేశారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండలం వెంకట్ రెడ్డిపల్లి గ్రామం పూసల తండా వాసులు కేతావత్ లక్ష్మీ కేతావత్ రాములు కుమార్తె వివాహనికి సర్పంచ్ రమేష్‌నాయక్ హాజరై ఈపెళ్ళి కానుక అంధించారు. గ్రామ పంచాయతీలో ఉన్న ప్రతి ఆడబిడ్డ పెళ్ళికి రూ.5116 ఇస్తానని చెప్పిన మాటకు కట్టుబడి ఆర్థికసాయం అందజేస్తున్నట్టు సర్పంచ్ రమేష్ నాయక్ తెలిపారు. కార్యక్రమంలో వార్డుసభ్యులు కిషన్, లింగం, గ్రామస్తులు నర్సింలు, రవి, రాజు, సామ్య, సత్యం, వంశీ, అంబర్‌సింగ్, రమేష్, శంకర్‌బాబు, రాజు, రఘురాం, సూర్య, శ్రీను పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికత కార్యక్రమాలతో ఐకమత్యం పెరుగుతుంది




**ప్రజాపక్షం/కొందుర్గు:** ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ప్రజల్లో ఐక మత్యం పెరుగుతుందని మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ అన్నారు. శుక్రవారం జిల్లేడు చౌదరిగూడ మండల పరిధిలోని వీరన్నపేట గ్రామంలో శ్రీ అభయాంజనేయస్వామి, గణేశుడు, నవగ్రహాలు, కుమారస్వామి, శివుడు, నంది, భవానీ అమ్మవారు, శ్రీ సీతారామ లక్ష్మణ స్వామి విగ్రహాలతో పాటు ధ్వజస్థంభం, నాభిశిలా ప్రతిష్టా మహోత్సవంలో అంజయ్య యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో వి.నారాయణరెడ్డి, హఫీజ్, శ్రీధర్‌రెడ్డి, సర్పంచ్‌లు సుమలత వెంకట్‌రాములు, దేవి రాంచరణ్, సోనిశేఖర్, చెన్నయ్య, సత్యప్రమోద్, మాణయ్య, రెడ్డినర్సింలు, కొండి యాదయ్య, నర్సింలు, జమాల్‌ఖాన్ పాల్గొన్నారు.

## స్వీయ జనగణనపై అవగాహన



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వీయ జనగణనపై ప్రజలందరు అవగాహన పెంచుకోవాలని ఫరూఖ్‌నగర్ తహసీల్దార్ నాగయ్య సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని లింగారెడ్డిగూడ గ్రామంలో సర్పంచ్ ఎంసి ప్రవీణ్‌కుమార్, ఉప సర్పంచ్ ఎర్రోళ్ల అశోక్‌ల ఆధ్వర్యంలో మార్‌దాన్ వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నాగయ్య మాట్లాడుతూ స్వీయ జనగణనపై ప్రజలందరు అవగాహన పెంచుకోవడంతోపాటు సెల్‌ఫోన్ ఉన్న ప్రతి వ్యక్తి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ మల్లేష్ యాదవ్, వార్డు సభ్యులు కోనేటి సాయికుమార్, గ్రామస్తులు నరేందర్‌రెడ్డి, జంగయ్య యాదవ్, ప్రతాప్‌రెడ్డి, దాదేమియా పాల్గొన్నారు.

## ఆరుట్ల పబ్లిక్ స్కూల్ సందర్శించిన విప్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి ఆద్వర్యంలో ప్రభుత్వ విఫ్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందం ఆది శ్రీనివాస్, సిహెచ్ విజయరమణరావు, యెన్నం శ్రీనివాస్ రెడ్డి, వేముల వీరేశం, బీర్ల ఆయిలయ్య, రాంచందర్ నాయక్, అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్‌లు శుక్రవారం సందర్శించి స్కూల్ సౌకర్యాలను పరిశీలించారు. బృందానికి స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి స్వాగతం పలికారు.

# ప్రభుత్వ మహిళా హాస్టల్ నిర్మాణ స్థలం మారిస్తే ఆందోళనలు

* సిపిఐ హెచ్చరిక
* శంకుస్థాపన సమయంలో ఆఘమేఘాలపై ఆదేశాలు
* అధికార పార్టీ నేతల ఒత్తిళ్లే కారణం
* హైడ్రా, ఆర్డీఓలకు వినతి పత్రాలు




**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** జవహర్‌నగర్ ప్రాంతంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ మహిళా హాస్టల్ నిర్మాణానికి ఇటీవలే జిల్లా అధికారులు కేటాయించిన స్థలంపై అధికార పార్టీ నాయకుల కన్నుపడింది. దీంతో వారు చక్రం తిప్పి అధికారులపై ఒత్తిడి తెచ్చారు. ఫలితంగా ఆ స్థలంలో భవన నిర్మాణానికి ముగ్గు సైతం చేసేందుకు స్థానిక తహసీల్దార్, ఇతర అధికారులు శంకుస్థాపన చేసేందుకు సిద్ధమవుతున్న తరుణంలో ఉన్నతాధికారుల నుండి వచ్చిన సమయంలో హాస్టల్ నిర్మాణానికి మరో ప్రాంతానికి కేటాయిస్తున్నామని, శంకుస్థాపన పనులు ఆపేయాలని చెప్పటంతో అధికారులు ఖంగుతిని చేసేదేమీ లేక పనులు కాస్తా ఆపేసారు. ఈ విషయం తెల్సిన మేడ్చల్ జిల్లా సిపిఐ ఇన్‌చార్జి తోటపల్లి శంకర్ ఆధ్వర్యంలో అధికారులను నిలదీసారు. హాస్టల్ కోసం మొదట్లో కేటాయించిన స్థలంలోనే నిర్మాణం చేపట్టాలని, అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు లొంగవద్దని డిమాండ్ చేసారు.

వివరాల్లోకి వెళితే.... మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యం లో ప్రభుత్వ మహిళా హాస్టల్ భవన నిర్మాణానికి గాను ఎంఎంసి మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని జవహర్‌నగర్ ప్రాంతం సర్వే నంబర్ 647/P లో ఒక ఎకరం 20 గుంటల స్థలాన్ని అధునాత న సౌకర్యాలతో భవనాన్ని సువిశాలంగా నిర్మించేందుకు జిల్లా అధికారులు ఇటీవల కేటాయించి స్థానిక రెవెన్యూ, మహిళా శిశు సంక్షేమ అధికారులకు ఉత్తర్వులు జారీ చేసి పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేయాలని ఆదేశించారు. దీంతో స్థానిక తహసీల్దా ర్, శిశు సంక్షేమ శాఖ అధికారులు ఆ



స్థలాన్ని చదును చేసి నిర్మాణ పనులు ప్రారంభించేందుకు ముగ్గు వేసి తయారయ్యారు. ఈ సమయంలోనే జిల్లా ఉన్నతాధికారుల నుండి హాస్టల్ భవనానికి సర్వే నంబరు 647 కాకుండా 646కి మారుస్తున్నామని, పనులు ఆపేయాలని మరోసారి ఆదేశాలు రావటంతో పనులు నిలిచిపోయాయి.

**తెర వెనుక భాగోతమిదీ...**

జవహర్‌నగర్ ప్రాంతంలో ఇటీవలి కాలంగా రియల్ బూమ్ ధరలు పెరిగి భూములకు రెక్కలు వచ్చాయి. ఇదే అదనుగా ప్రభుత్వ మహిళా హాస్టల్ భవనానికి కేటాయించిన స్థలాన్ని ఎలాగైనా దక్కించుకోవాలని అధికార పార్టీ నేతలు ప్రభుత్వ పెద్దలతో జిల్లా అధికారులపై ఒత్తిళ్లు తెచ్చి భవన నిర్మాణానికి ముగ్గు వేసే సమయంలో కేటాయించిన స్థలాన్ని మరో చోటుకి మార్చే విధంగా సఫలీకృతులయ్యారు.

**స్థలాన్ని మారిస్తే ఆందోళనలు చేస్తాం**

హాస్టల్ స్థలాన్ని జిల్లా అధికారులు మార్చారన్న విషయం తెల్సిన మేడ్చల్ జిల్లా సిపిఐ పార్టీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. వెంటనే రంగంలోకి దిగిన పార్టీ జిల్లా ఇన్‌చార్జి తోటపల్లి శంకర్, కాప్రా మండల కార్యదర్శి దర్శనం యాదగిరి, గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వి. స్వరూప నాయక్, ఏఐటియుసి నాయకులు ఆంబాల ఎల్లయ్యలు హైడ్రా కార్యాలయానికి వెళ్లి కమిషనర్, ఆర్డీఓ, తహసీల్దార్లకు ప్రభుత్వ హాస్టల్ భవనాన్ని మొదట్లో కేటాయించిన స్థలం లో మాత్రమే నిర్మించాలే తప్ప మరో చోటకి మార్చవద్దని లిఖితపూర్వకంగా వినతిపత్రాలు సమర్పించారు. ప్రభుత్వ స్థలాలను కాపాడుతూ రోజురోజుకు అభివృద్ధి చెందుతున్న జవహర్‌నగర్ ప్రాంతానికి మరింత వన్నెతేవాలే తప్ప అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి వారికి వత్తాసుగా నిలవరాదని కోరారు.

# అనాథాశ్రమంలో మంత్రి పొన్నం బర్త్‌డే వేడుకలు

### దివ్యాంగుల ఆశ్రమంలో అరటిపండ్లు పంచిపెట్టిన జైపాల్‌రెడ్డి, బొమ్మలపల్లి నర్సింహయాదవ్







**ప్రజాపక్షం/శామీర్‌పేట :** రాష్ట్ర రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలు మూడుచింతలపల్లి మున్సిపల్ జగ్గంగూడలోని డిజేబుల్డ్ ఆశ్రమంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్, జిల్లా ఆర్‌టిఏ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి, మూడుచింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు దోసకాయల వెంకటేష్ ఆధ్వర్యంలో ఆశ్రమంలోని వికలాంగుల, అనాథల మధ్య కేక్‌కట్ చేసి నిరాడంబరంగా పొన్నం ప్రభాకర్ బర్త్ డే వేడుకలు నిర్వహించారు. ఆశ్రమంలోని అనాదాలకు అరటి పండ్లు పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని చిన్నారులు పొన్నం ప్రభాకర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి విష్ణుగౌడ్, మహిళా కార్యదర్శి లతారెడ్డి, కౌన్సిలర్ మల్లేష్‌యాదవ్, మాజీ సర్పంచ్ రాంచెందర్, నాయకులు బస్వారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, మహేష్, కోమురయ్య, శ్రీనివాస్‌యాదవ్, బన్నీ, భూపాల్, రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అలాగే టిపిసిసి ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డి రాష్ట్ర రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మినిష్టర్ క్వార్టర్స్‌లో కలిసి పూలబొకే అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమతం శిరీషా కృష్ణారెడ్డి పొన్నం ప్రభాకర్‌ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# రుణాల మంజూరులో జిల్లా యంత్రాగం విఫలం

### దిశ సమావేశంలో ఎంపి ఈటల ఆగ్రహం




**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు రుణా లు మంజూరు చేయటంలో జిల్లా యంత్రాంగం పూర్తిగా విఫలమైందని మల్కాజిగిరి ఎంపి ఈటెల రాజేందర్ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసారు. కేంద్ర ప్రభుత్వం పారిశ్రామిక రంగ అభివృద్ధికి రూ.4లక్షల కోట్లు కేటాయిస్తే ఆశావహులకు సమయానికి రుణాలిచ్చి ప్రోత్సహించాల్సింది పోయి గ్యారంటీలు, ఇతర నిబంధనల పేరిట ఇబ్బందులకు గురి చేస్తే పథకాలు ఏ విధంగా సత్ఫలిస్తాయని నిలదీసారు ప్రభుత్వ పథాకాల అమలులో రాష్ట్ర అధికారులు ప్రభుత్వాలు సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ పేదల ఆరోగ్యం కోసం ప్రవేశపెట్టిన ఆయష్మాన్ భారత్ సక్రమంగా అమలు కావటం లేదని, ఈ విషయంలో జిల్లా అధికారుల నిర్లక్ష్యం కారణం స్పష్టంగా కనపడుతోందని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేఆరు. డబుల్ బెడ్‌రూం ఇళ్లను స్థానికంగా ఉన్న పేదలకు మాత్రమే కేటాయించాలన్నారు.



ఈ ఇళ్లల్లో విద్యుత్, మంచి నీరు, డ్రైనేజిలాంటి మౌలిక వసతుల విషయంలో లబ్దిదారులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నట్లు తెలుస్తోందని, ఈ పనులకు గాను ప్రతిపాదనలు సిద్ధం చేస్తే వాటికి గాను అవసరమైన నిధులు మంజూరు చేయిస్తానన్నారు. జవహర్‌నగర్, బాలాజినగర్ డంపింగ్‌యార్డుల సమస్య శాశ్వత పరిష్కారం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో తాను సంప్రదించానన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో మెరుగైన వసతులు కల్పించాలని, గర్భిణీలు, పిల్లలకు పౌష్టికాహారం అందించటంలో రాజీ పడవద్దన్నారు. 10 వేల కంటె ఎక్కువ జనాభా ఉన్న ప్రాంతాల్లో పిహెచ్‌సిలు మరిన్ని ఏర్పాటు చేయాలని, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ ను అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ ఆస్పత్రుల్లో విధిగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. యువతకు ఉపాధి కల్పించే క్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో మేడ్చల్, ఉప్పల్, మల్కాజిగిరి ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, రాజశేఖరరెడ్డి, ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, జిల్లా అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డిఆర్డీవో సాంబశివరావు, మున్సిపల్ చైర్మన్లు, ఇతర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# మల్లారెడ్డి విశ్వవిద్యాలయంలో సరికొత్త కోర్సులు

**ప్రజాపక్షం/దుండిగల్:** మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులను డిజిటల్ నైపుణ్యాలతో నిపుణులుగా తీర్చిదిద్దేందుకు మల్లారెడ్డి విశ్వవిద్యాలయంలో ప్రముఖ సంస్థ ఇరోస్ ఏఐ విద్యతో కలిసి క్రియేటివ్ మీడియా, ఫిల్మ్ మేకింగ్ యానిమేషన్, విఎఫ్ఎక్స్, గేమింగ్ వంటి రంగాల్లో సరికొత్త ఇండస్ట్రీ ఓరియెంటెడ్ కోర్సులను ప్రారంభించారు. అనంతరం చైర్మన్ భద్రారెడ్డి, వైస్ చైర్మన్ డాక్టర్ ప్రీతిరెడ్డిలు మాట్లాడుతూ చదువుకు, పరిశ్రమకు, అవసరాలకు మధ్య ఉన్న దూరాన్ని తగ్గించడమే లక్షణమని ఈ భాగస్వామ్యం ద్వారా విద్యార్థులకు నిపుణుల పర్యవేక్షణలో రియల్ టైమ్ ప్రాజెక్ట్‌లు, అడ్వాన్స్‌డ్ స్టూడియోల్లో శిక్షణ పొందే అవకాశం లభిస్తుందన్నారు. ఇప్పుడున్న కంపెనీలన్ని కేవలం డిగ్రీ ఉన్న వారికోసం కాకుండా టెక్నాలజీపై పట్టు ఉండి కొత్తగా ఆ లోచించే నిపుణుల కోసం వెతుకుతున్నాయని అన్నారు. అనంతరం సిఈఓ ఈరోస్ ప్రశాంత్ పండిత్ మాట్లాడుతూ ఊహాలకు సాంకేతికతను తోడు చేయగలిగే వారికే భవిష్యత్తు ఉంటుందని ప్రకటనల రంగం, గేమింగ్, కమ్యూనికేషన్ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తెస్తుందని ఈ కోర్సులు నేర్చుకున్న వారికి లెక్కలేనన్ని అవకాశాలు ఉంటాయని చెప్పారు.

# రవాణా శాఖలో ఫేస్‌లెస్ సేవలు ప్రారంభం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వం రవాణా శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు మరింత సులభమైన సేవలు అందించేందుకు ఫేస్‌లెస్ సర్వీసెస్‌ను సారథి మాడ్యూల్‌లో ఆన్‌లైన్ ద్వారా అందుబాటులోకి తీసుకొచ్చినట్లు రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ ధృవీకరణ ఆధారంగా పౌరులు ఇకపై రవాణా కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇంటి నుంచే పలు సేవలను పొందవచ్చని వెల్లడించారు. డిజిటల్ పరిపాలన, ప్రజాకేంద్రీకృత సేవల విస్తరణలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఈ సేవలు సారథి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉండగా, మరో మూడు రోజుల్లో నెక్ట్స్‌జెన్ ఎంపరివాహన్ మొబైల్ యాప్ లో కూడా అందుబాటులోకి రానున్నాయన్నారు. ఫేస్‌లెస్ విధానంలో అందుబాటులోకి వచ్చిన సేవల్లో లర్నర్ లైసెన్స్‌లో పేరు, చిరునామా మార్పు, ఫోటోసంతకం మార్పు, డూప్లికేట్ లర్నర్ లైసెన్స్ జారీ, డ్రైవింగ్ లైసెన్స్ పునరుద్ధరణ, డూప్లికేట్ డిఎల్ జారీ, బయోమెట్రిక్స్ మార్పు, పుట్టిన తేదీ సవరణ, హాజార్డస్ మెటీరియ ల్ డ్రైవింగ్ ఎండార్స్‌మెంట్, పిఎస్‌వి బ్యాడ్జ్ డూప్లికేట్ జారీ వంటి మొత్తం 17 సేవలు ఉన్నాయని తెలిపారు. ఈ సేవల అమలుతో పారదర్శకత పెరగడంతో పా టు ప్రజలకు సమయం, ఖర్చు కూడా ఆదా అవుతుందని పేర్కొన్నారు. ప్రజలు ఈ సేవలను అధికారిక సారథి పోర్టల్ ద్వారా వినియోగించుకోవచ్చని తెలిపారు.




## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం.. స్వచ్ఛత పాటిద్దాం

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్:** మహదేవ్‌పూర్ గ్రామంలో అనురాగ్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ సెల్ ఆధ్వర్యంలో విద్యార్థులు 'పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం స్వచ్ఛత పాటించుదాం' అనే నినాదంతో ఆలయ పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. 200కి పైగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఆలయ పరిసరాలు, సామాజిక ప్రాంతాలను శుభ్రపరిచారు. పరిశుభ్రత పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యతపై గ్రామ ప్రజల్లో విద్యార్థుల్లో అవగాహన కల్పించారు. గ్రామస్థులతో కలిసి పనిచేయడం ద్వారా విద్యార్థులు సమాజసేవ నాయకత్వ లక్షణాలు జట్టు భావన, పర్యావరణ అవగాహన వంటి అంశాలలో ప్రాయోగిక అనుభవాన్ని పొందారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సెల్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ సి.మల్లేష్, ఆఫీసర్ టి.పురుషోత్తం, టి.విద్యాసాగర్, సౌరభ్ బార్పుటే, తదితరులు పాల్గొన్నారు.



## రోలింగ్, పాలిషింగ్ సెంటర్‌ను ప్రారంభించిన డిసి వాణి

**ప్రజాపక్షం/చర్లపల్లి:** మహిళా సంఘాల అభివృద్ధి,స్వయం ఉపాధి అవకాశాల పెంపు దిశగా ఈ కేంద్రాలు ఉపయోగపడతాయని ఘట్కేసర్ డిప్యూటీ కమిషనర్ వాణి అన్నారు. ఘట్కేసర్ సర్కిల్ 5వ డివిజన్ పరిధిలోని ఏర్పాటు చేసిన రోలింగ్, పాలిషింగ్ సెంటర్‌ను డిసి వాణి ప్రారంభించారు. ఈ కేంద్రాలు మహిళ సంఘాల అభివృద్ధి ఎంతో ఉపయోగపడతాయని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో యుసిడి ప్రాజెక్ట్ ఆఫీసర్ కె. సురేష్‌కుమార్, అధికారులు, సిబ్బంది, మహిళా సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.




## మాజీ ఎమ్మెల్యే రాజిరెడ్డికి నివాళులు

**ప్రజాపక్షం/చర్లపల్లి:** దిగవంత బండారి రాజిరెడ్డి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బూడిద శ్రావణ్ కుమార్‌గౌడ్ అన్నారు. ఉప్పల్ తొలి ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని చర్లపల్లి చౌరస్తాలో ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. రాజిరెడ్డి ప్రజల కోసం నిస్వార్థంగా పని చేసిన మహానేత అని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డం యాదగిరి, మన్‌మోహన్‌రెడ్డి, మల్లేష్, సురేష్, సర్ఫరాజ్, తదితరులు పాల్గొన్నారు.

**మాజీ కార్పొరేటర్ ఆధ్వర్యంలో**

ప్రజల సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేసిన మహనీయులు




బండారి రాజిరెడ్డి అని మాజీ కార్పొరేటర్ పావనీరెడ్డి అన్నా రు. శుక్రవారం ఎఎస్ రావు డివిజన్ పరిధిలోని కమలానగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులు, నాయకులతో కలసి ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళుల్పించారు. ప్రజలపట్ల మీ ప్రేమ ఎప్పటికీ చిరస్మరణీయమని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ ప్రెసిడెంట్ బూడిద జనార్ధన్‌గౌడ్, నాయకులు కొత్త అంజిరెడ్డి, అసోసియేషన్ సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

## గడ్డి మందు తాగి ఆత్మహత్య

**ప్రజాపక్షం /వికారాబాద్ :** మున్సిపల్‌లోని నక్షత్ర లాడ్జిలో మోమిన్‌పేట్ మండలంలోని వెల్‌చల్ గ్రామానికి చెందిన మల్లరెడ్డి (52) అనే వ్యక్తి 07 05.2026 రాత్రి 7గంటలకు లాడ్జిలో రూమ్ తీసుకొని రెండు క్వార్టర్ బాటిళ్లు, గ్లెసిన్‌గడ్డి మందు తీసుకొని తాగి మృతిచెందినట్లు పోలీస్ స్టేషన్‌కు సమాచారం రావడంతో మధ్యాహ్నం తలుపులు పగులగొట్టి చూడగా వ్యక్తి మృతిచెందినట్లు తెలిసింది, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ రఘుకుమార్ తెలిపారు.




## చలివేంద్రం ప్రారంభించిన సర్పంచ్

**ప్రజాపక్షం/మర్పల్లి:** వికారాబాద్ నియోజకవర్గంలోని మర్పల్లి మండల పరిధిలోని పట్లూర్ గ్రామంలో ప్రజలకు దాహం తీర్చడానికి చలివేంద్రాన్ని సర్పంచు పరశురాం ప్రారంభించారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గ్రామ నాయకులతో కలిసి బాబుజగ్జీవన్ స్టాట్యూ సమీపంలో ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అఖిల్, మండల పార్టీ అధ్యక్షులు సురేష్‌యాదవ్, మాజీ ఎంపిటిసి మహేష్, సురేష్, గ్రామ కార్యదర్శి గోపాల్, తదితరులు పాల్గొన్నారు.



## సిఎం రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు


**ప్రజాపక్షం/శామీర్‌పేట :** హజ్ యాత్రికులకు కేంద్ర ప్రభుత్వం విధించిన అదనపు భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చి ఆదుకుంటుందని సిఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం నగరంలోని హజ్ భవన్‌లో హజ్ కమిటీ చైర్మన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విచ్చేసి జెండా ఊపి హజ్ యాత్రికుల బస్సును సాగనంపారు. హజ్ యాత్రికులకు అదనంగా కేంద్రప్రభుత్వం విధిస్తున్న రూ.10వేల భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా హజ్ కమిటీ స్టేట్ మెంబర్ మహ్మద్ ముజుబుద్దిన్ (శామీర్‌పేట) ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



## ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

### ఆర్‌టిఏ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహా యాదవ్

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిర్మ ఇళ్ల పథకం ద్వార నూతన ఇంటిని కట్టిస్తున్నామని మేడ్చల్ మార్కెట్ కమిటి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్, జిల్లా ఆర్‌టిఏ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డిలు అన్నారు. శుక్రవారం మూడుచింతలపల్లి మున్సిపాలిటి కాంగ్రెస్ అధ్యక్షుడు దోసకాయల వెంకటేష్ ఆధ్వర్యంలో నారాయణపూర్‌లో నూతనంగా నిర్మించుకున్న కొక్కు రాధ, జయరాములు దంపతుల నూతన గృహ ప్రవేశాన్ని రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం పేద వర్గాలకు చెందిన వారిని గుర్తించి ఇందిరమ్మ ఇండ్లను కట్టిస్తుందన్నారు. బడుగు బలహీన వర్గాలకు సిఎం రేవంత్‌రెడ్డి పెద్ద పీట వేస్తున్నారని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం నిరంతరంగా ఉంటుందని అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి విష్ణుగౌడ్, మహిళా కాంగ్రెస్ కార్యదర్శి లత. కౌన్సిలర్ మల్లేష్‌యాదవ్, నాయకులు బస్వారెడ్డి, మహేష్, దామోదర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.




## బొక్క ప్రభాకర్‌రెడ్డి నూతన గృహప్రవేశం

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** మాజీ మున్సిపల్ కౌన్సిలర్ బొక్క సంగీత ప్రభాకర్ రెడ్డి నూతన గృహప్రవేశానికి ముఖ్యఅతిథిగా మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ డిసిసి ఉపాధ్యక్షులు వేముల మహేష్ గౌడ్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్, పోచారం మాజీ కాంగ్రెస్ అధ్యక్షులు సింగిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, ఆలయ ధర్మకర్త మెరుగు నరేష్ గౌడ్, మెట్టు నర్సింహారెడ్డి, కృష్ణ రెడ్డి, కడుపోల్ల మల్లేష్, బొక్క సంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## పేదల సొంతింటి కల నెరవేర్చడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం

**ప్రజాపక్షం/పెద్దేముల్:** పేదల సొంతింటి కలను నెరవేర్చడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పెద్దేముల్ మండల పరిధి, ఎర్రగడ్డ తాండ, రచ్చకట్ట తాండలో మనుషబాయి ప్రకాష్‌లు, తులసిబాయి కిషనే నిర్మించుకున్న ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ పూజ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరైనారు. ఇందిరమ్మ ఇంటికి రిబ్బన్ కట్‌చేసి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పూజ కార్యక్రమంలో పాల్గొని లబ్దిదారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదలకు సొంతింటి కలను నెరవేర్చ డం జరుగుతుందన్నారు. ప్రతి గ్రామానికి పది నుండి 20వరకు ఇందిరమ్మ ఇండ్లను ఇవ్వడం జరిగిందన్నారు. దాదాపుగా అన్ని గ్రామాలలో 50శాతం మేరకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పూర్తి దశకు చేరుకున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో తాండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ నర్సిములు, మాజీ చైర్మన్ పట్లోళ బాల్‌రెడ్డి, కోట్‌పల్లి మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ నారాయణరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు మహిపాల్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు గోపాల్, సీనియర్ నాయకులు మల్లేశం, గౌరి మల్లప్ప, జిల్లా కార్యదర్శి బాబుసింగ్, సర్పంచ్‌లు స్థానిక నాయకులు, తదితరులు ఉన్నారు.



## ఐడిపిఎల్ భూములపై చర్యలొద్దు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని ఐడీపీఎల్‌కు గతంలో ప్రభుత్వం నిర్దిష్ట ఔషద తయారీ నిమిత్తం కేటాయించిన భూముల స్వాధీన వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి కఠిన చర్యలు తీసుకోరాదని తెలంగాణ హైకోర్టు డివిజన్ బెంచ్ మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ పిటిషన్‌పై సింగిల్ జడ్జి జూన్ 22న విచారణ జరగనున్న నేపథ్యంలో అప్పటి వరకు యథాతథ స్థితిని కొనసాగించాలని స్పష్టం చేసింది. హైదరాబాద్‌లోని ఐడీపీఎల్‌కు చెందిన 891.38 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకుని టీజీఐఐసీకి అప్పగించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ 2008 జనవరి 27న ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఆ ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని బీఐఎస్ఆర్ (బోర్డు ఆఫ్ ఇండస్ట్రియల్ అండ్ ఫైనాన్షియల్ రీకన్‌స్ట్రక్షన్) 2008 ఫిబ్రవరి 6న ఆదేశాలు ఇచ్చింది. ఈ నేపథ్యంలో బీఐఎఫ్ఆర్ ఆదేశాల అమలును నిలిపివేస్తూ ఇటీవల హైకోర్టు సింగిల్ జడ్జి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ ఐడీపీఎల్ శుక్రవారం దాఖలు చేసిన హౌస్‌మోషన్ అప్పీల్ పిటిషన్‌ను జస్టిస్ ఈవీ వేణుగోపాల్, మొహియుద్దీన్ డివిజన్ బెంచ్ శుక్రవారం విచారించింది. వివాదంపై తుది నిర్ణయం సింగిల్ జడ్జి ముందే తేల్చుకోవాలని సూచించిన ధర్మాసనం, అప్పటి వరకు భూముల విషయంలో ప్రభుత్వం కఠిన చర్యలకు దిగరాదని ఆదేశిస్తూ అప్పీల్ విచారణను ముగించింది.

## కెజిబివి బెడ్ల సరఫరా అక్రమాలపై విచారణకు ఆదేశం : హైకోర్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మాజీ ఎమ్మెల్యే (బిఆర్ఎస్) పెద్ది సుదర్శన్‌రెడ్డి రాసిన ఫిర్యాదు లేఖ ఆధారంగా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలకు (కేజీబీవీ) బంకర్ బెడ్లు, పరుపులు, దిండ్ల సరఫరాలో అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖను హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక తీర్పు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 252 కేజీబీవీ పాఠశాలలకు 45 వేలకుపైగా బంకర్ బెడ్లు, పరుపులు, దిండ్ల సరఫరా కోసం కుదుర్చుకున్న ఒప్పందంలో భారీ స్థాయిలో అవకతవకలు జరిగాయంటూ సుదర్శన్‌రెడ్డి విజిలెన్స్ శాఖకు లేఖ రాశారు. విజిలెన్స్ శాఖ ఆ లేఖను పాఠశాల విద్యాశాఖకు పంపినప్పటికీ ఎలాంటి చర్యలు లేవని వేసిన పిటిషన్‌పై తీర్పు వెలువడింది. పిటిషనర్ తరఫున, మార్కెట్‌లో ఒక్కో బెడ్ ధర రూ.15 వేల నుంచి రూ.17 వేల మధ్య ఉండగా, కాంట్రాక్టర్‌కు రూ.33 వేల చొప్పున సరఫరా ఒప్పందం కుదుర్చడం ద్వారా ప్రభుత్వ ఖజానాపై సుమారు రూ.100 కోట్ల భారం పడే అవకాశం ఉందని వాదించారు. ఈ అంశాన్ని పరిశీలించిన న్యాయమూర్తి, పిటిషనర్ చేసిన ఆరోపణలు విచారణార్హమని స్పష్టం చేశారు. పిటిషనర్ టెండర్ ప్రక్రియను సవాలు చేయలేదని, తన వినతిపత్రంపై చర్యలు తీసుకోవాలని కోరారని చెప్పారు. విజిలెన్స్ శాఖ లేఖను పరిగణనలోకి తీసుకుని సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై సకాలంలో చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కార్యదర్శిని ఆదేశిస్తూ తీర్పు చెప్పారు.


## హింసను కాంగ్రెస్ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించదు

ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కరీంనగర్‌లో రెండు పార్టీల నాయకులు వీధి రౌడీల్లా కొట్టుకోవడం దురదృష్టకరమని, ఇలాంటి దాడులను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. సిఎల్‌పి మీడియా సెంటర్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ హింసను కాంగ్రెస్ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించదన్నారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రవర్తన నీచాతి నీచంగా ఉందని మండిపడ్డారు. హీరోలమని భావిస్తున్న బిఆర్ఎస్ నేతలు తమ భాషతో జీరోలుగా మారుతున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కౌశిక్ రెడ్డి ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని, వరంగల్ సభలో కెటిఆర్ కూడా అసహనంతో తీవ్ర పదజాలం ఉపయోగించారని ఆరోపించారు. మితిమీరిన అహంకారం, అనుచిత భాషను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. కౌశిక్ రెడ్డి శాసనసభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేసిన మేడిపల్లి సత్యం, ఎథిక్స్ కమిటీ ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. కరీంనగర్ ఘటనపై డిజిపిని కలిసి ఫిర్యాదు చేస్తామని వెల్లడించిన ఆయన, బిఆర్ఎస్ ఇచ్చిన బంద్ పిలుపులో ప్రజలు పాల్గొనవద్దని మేడిపల్లి సత్యం విజ్ఞప్తి చేశారు.

## ప్రజావాణి అధికారులకు ప్రత్యేక శిక్షణ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రవ్యాప్తంగా ప్రజావాణి కార్యక్రమాన్ని మరింత పటిష్టంగా నిర్వహించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా శుక్రవారం హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో 33 జిల్లాల ప్రజావాణి అధికారులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సిఎం ప్రజావాణి ఇన్‌చార్జ్ డాక్టర్ జి. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ ఈ తరగతులు నిర్వహించి, విధివిధానాలను వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు సిఎస్ కె. రామకృష్ణారావు జారీ చేసిన జి.ఓ నెంబర్ 3 ప్రకారం ఈ శిక్షణ నిర్వహించారు. ప్రతి జిల్లా కలెక్టరేట్‌లో ప్రజావాణి కోసం ప్రత్యేక సెల్లు ఏర్పాటు చేశారు. తహసీల్దార్ స్థాయి అధికారి దీనికి ఇన్‌చార్జ్ వ్యవహరిస్తారు. రాష్ట్రానికి కొత్తగా కేటాయించిన ఆరుగురు ఐఎఎస్ అధికారులు ప్రజా భవన్‌ను సందర్శించి, ప్రజావాణి అమలు తీరును పరిశీలించారు. శుక్రవారం జరిగిన ప్రజావాణిలో మొత్తం 281 దరఖాస్తులు అందాయి.


# విజయవంతంగా రైతు వారోత్సవాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 4 నుంచి ప్రారంభమైన రైతు వారం కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగుతున్నాయి. ఇందులోభాగంగా వ్యవసాయ శాఖ దాని అనుబంధ శాఖల సమన్వయంతో రైతులకు ఆధునిక సాగు పద్ధతులు, శాస్త్రీయ వ్యవసాయం, మార్కెటింగ్, యాంత్రీకరణ, పశుసంవర్ధక, నీటిపారుదల అంశాలపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. ఈనెల 4న ఈ కార్యక్రమానికి తాండూరులో వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు శ్రీకారం చుట్టగా గడిచిన 5 రోజులుగా వివిధ కార్యక్రమాలు వివిధ కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 14,565 మట్టి నమూనాలను సేకరించి, 20,734 మట్టి విశ్లేషణ పత్రాలను రైతులకు అందజేశారు. నానో ఎరువుల వినియోగం, ప్రకృతి వ్యవసాయం, సన్న వరి సాగు వంటి అంశాలపై రైతులకు శాస్త్రీయ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో 1,32,423 మంది రైతులు ప్రత్యక్షంగా పాల్గొన్నారు. 5వ తేదీన వరంగల్‌లో నిర్వహించిన మెగా రైతు మేళాలో ప్రత్యామ్నాయ పంటల సాగు, ముఖ్యంగా ఆయిల్ పామ్, నూనె గింజలు, పప్పు ధాన్యాల సాగుపై రైతులకు శిక్షణ ఇచ్చారు. బిందు సేద్యం, నీటి పొదుపు సాంకేతికతల వినియోగంపై ప్రత్యేక అవగాహన కల్పించారు. 6న రైతులకు పంట రుణాలు, కిసాన్ క్రెడిట్ కార్డులు, సహకార సంఘాల సేవలపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 12,779 మంది రైతులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గోదాముల నిల్వ సదుపాయాలు, కనీస మద్దతు ధర మార్కెటింగ్ అవకాశాలపై మార్కెటింగ్ శాఖ అధికారులు రైతులకు వివరించారు.7వతేదీన ఆధునిక వ్యవసాయ యంత్రాలు, డ్రోన్ సాంకేతికత ప్రదర్శనలు నిర్వహించారు. 45,901 మంది రైతులు పాల్గొన్న ఈ కార్యక్రమాల్లో 1,344 వ్యవసాయ యంత్రాలను ప్రదర్శించారు. 370 మంది రైతుల నుండి యంత్రాల కోసం దరఖాస్తులు స్వీకరించారు. అలాగే పీఎం కుసుమ్ పథకం కింద సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు, సబ్సిడీలపై అవగాహన కల్పించారు.శుక్రవారం మండల స్థాయి సమావేశాల్లో పశుసంవర్ధక, మత్స్య, నీటిపారుదల శాఖల అధికారులు రైతులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. వేసవిలో పశువుల సంరక్షణ, పచ్చిగడ్డి సాగు, చెరువుల నిర్వహణ, చేపల ఉత్పత్తి పెంపు, కాలువల మరమ్మతులు, గేట్ల నిర్వహణ వంటి అంశాలపై కార్యాచరణ వివరించారు.

# కొనుగోళ్ల ప్రక్రియ మరింత వేగవంతం

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మొక్కజొన్న కొనుగోళ్ల ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. హమాలీ, రవాణా, గన్ని బ్యాగులు, గోదాములు సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్లు చొరవ తీసుకోవాలని సూచించారు. శుక్రవారం సచివాలయంలో వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సురేంద్రమోహన్‌తో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మొక్కజొన్న కొనుగోళ్లలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి పలు సూచనలు చేశారు. రాష్ట్రంలో మొక్కజొన్న కొనుగోళ్లతో పాటు, వరిధాన్యం కొనుగోళ్లు పెద్ద ఎత్తున జరుగుతున్న నేపథ్యంలో మొక్కజొన్న కొనుగోళ్లకు సంబంధించి కలెక్టర్లు పూర్తి బాధ్యత తీసుకోవాలన్నారు. ఒకవేళ రైతులు గన్నీబ్యాగులను స్వంతంగా తెచ్చుకున్నట్లయితే దానికి సంబంధించిన మొత్తాన్ని ప్రభుత్వం రైతుల ఖాతాలలో జమ చేస్తుందని మంత్రి తెలిపారు. కొనుగోలు కేంద్రాల నుండి గోదాముల వరకు రవాణాలో ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని రవాణాశాఖ కమిషనర్ ఇలంబర్తికి మంత్రి సూచించారు. మంత్రి సూచనల మేరకు రవాణా శాఖ సంయుక్త కమిషనర్ చంద్రశేఖర్ గౌడ్‌ను నోడల్ అధికారిగా నియమించారు.

**పలు జిల్లాలకు ప్రత్యేక అధికారులు :**
మొక్కజొన్న మార్కెట్‌కు అధికంగా వస్తున్నందున, ఉమ్మడి జిల్లాల వారిగా రాష్ట్ర స్థాయి అధికారులను ప్రత్యేక అధికారులను నియమిస్తూ, వ్యవసాయశాఖ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్, కరీంనగర్ వ్యవసాయ సంచాలకులు డాక్టర్. బి. గోపి, మెదక్, ఖమ్మం జిల్లాలకు సహకార శాఖ స్పెషల్ కమిషనర్ రాహుల్ రాజ్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలకు ఉద్యానశాఖ సంచాలకులు యాస్మీన్ బాషా, ఆదిలాబాద్. నల్లగొండ జిల్లాలకు హాకా ఎండి కె. చంద్రశేఖర్ రెడ్డి, నిజామాబాద్ లకు గిడ్డంగుల సంస ఎండి డాక్టర్ కొర్ర లక్ష్మి లను ప్రభుత్వం ప్రత్యేక అధికారులుగా నియమించింది.

## టిజి20 లీగ్ వివాదం...

హెచ్‌సిఎకు టిసిఎ నోటీసులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ క్రికెట్ వర్గాల్లో తీవ్ర వివాదానికి దారితీసేలా తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టిసిఎ) సంచలన చర్యలకు దిగింది. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ)ప్రచారం చేస్తున్న టిజి20 లీగ్‌పై అనుమతులు, ఆమోదాల విషయంలో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తూ టిసిఎ అధికారిక నోటీసు జారీ చేసింది. అలాగే బిసిసిఐకు అత్యవసర వినతి పత్రాన్ని సమర్పించింది. ఎటువంటి అధికారిక అనుమతి పత్రాలు లేకుండానే హెచ్‌సిఎ తరచుగా బిసిసిఐ ఆమోదం ఉంది అంటూ ప్రచారం చేయడం క్రికెట్ వర్గాలను తప్పుదోవ పట్టించే చర్యగా ఉందని టిసిఎ పేర్కొంది. కార్పొరేట్లు, ఫ్రాంచైజీలు, ఆటగాళ్లు మఇతర స్టేక్‌హోల్డర్లు ఈ ప్రకటనల వల్ల గందరగోళానికి గురవుతున్నారని విమర్శించింది. అదేవిధంగా, టిజి20 లీగ్‌కు సంబంధించిన గవర్నింగ్ కౌన్సిల్‌కు హెచ్‌సిఎ జనరల్ బాడీ ఆమోదం ఉందో లేదో కూడా స్పష్టత ఇవ్వాలని కోరింది. అధికారిక లేఖలకు సమాధానం ఇవ్వకుండా, జవాబుదారీతనాన్ని తప్పించుకునే ప్రయత్నం జరుగుతోందని టిసిఎ ఆరోపించింది. జిల్లా స్థాయి క్రికెట్ అభివృద్ధిపై కూడా టిసిఎ స్పందిస్తూ, గత 12 ఏళ్లుగా హైదరాబాద్ వెలుపల తమ వ్యవస్థ బలంగా కొనసాగుతోందని, అది బిసిసిఐ నిబంధనల ప్రకారమే నడుస్తోందని స్పష్టం చేసింది. 2021లో వచ్చిన బిసిసిఐ సూచనల ప్రకారం హెచ్‌సిఎ, టిసిఎతో సమన్వయం చేసుకుని పనిచేయాల్సిన అవసరం ఉందని గుర్తు చేసింది. ఇక జూన్ 2లో తెలంగాణ ప్రీమియర్ లీగ్ (టిపిఎల్)ను పారదర్శక ఎంపిక విధానంతో ప్రారంభించనున్నట్లు టిసిఎ ప్రకటించింది.

# మున్సిపాలిటీ రికార్డులు అస్తవ్యస్తం

ప్రభుత్వ ఆదాయానికి భారీ నష్టం

పన్నుల వసూళ్లలో అధికారుల నిర్లక్ష్యం

ఎసిబి తనిఖీల్లో వెలుగు చూసిన మిర్యాలగూడ మున్సిపాలిటీ అవినీతి



**ప్రజాపక్షం/మిర్యాలగూడ:** నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మున్సిపాలిటిపై గురువారం జరిగిన ఏసీబీ దాడుల్లో పలు కీలకమైన విషయాలను శుక్రవారం ప్రెస్ నోట్ ద్వారా ఏసీబీ అధికారులు వెల్లడించారు. 2025–26 సంవత్సరానికి మొత్తం పన్ను అంచనా రూ.24.86కోట్లు ఉండగా వసూలైంది కేవలం రూ.9.17కోట్లు మాత్రమేనని రూ.15.68కోట్లు బకాయిలుగా మిగిలాయన్నారు. దీని వల్ల ప్రభుత్వానికి భారీ ఆదాయ నష్టం జరిగిందన్నారు. షాపుల పన్నుల వసూళ్లలో 2025–26లో మున్సిపాలిటీలో 1766 షాపులు ఉండగా పన్ను అంచనా రూ.43.3లక్షలు కాగా కాని వసూలైంది రూ.28.35లక్షలు మాత్రమే. ఇంకా రూ.14.95లక్షలు బకాయిలుగా ఉన్నట్లు గుర్తించామన్నారు. 2026–27లో 1783 షాపులకు రూ.36.18లక్షలు అంచనా వేయగా, కేవలం రూ.15.01లక్షలు మాత్రమే వసూలు కాగా రూ.21.17లక్షలు బకాయిలుగా కనిపించిందన్నారు. టౌన్ ప్లానింగ్ రెవెన్యూ 2024–25లో రూ.3.29కోట్లు ఉంటే 2025–26లో రూ.3.05కోట్లకు పడిపోగా మ్యుటేషన్ దరఖాస్తుల్లో భారీ నిర్లక్ష్యం కనిపించిందన్నారు. 2025 26లో 86 దరఖాస్తుల్లో 61 పెండింగ్‌లో ఉన్నాయని, 2026–27లో 34 బిల్డింగ్‌లకు అనుమతులు ఇచ్చినట్లు చూపినా, అసలు 18 దరఖాస్తులే వచ్చినట్లు రికార్డుల్లో ఉన్నట్లు చెప్పారు. రికార్డుల నిర్వహణలో బిల్డింగ్ పర్మిషన్, లే అవుట్, ఎన్‌క్రోచ్‌మెంట్ రిజిస్టర్లు సరిగా నిర్వహించలేదని కొన్ని రిజిస్టర్లపై అధికారుల సంతకాలు కూడా లేకుండానే ఉన్నట్లు గుర్తించగా అధికారుల నిర్లక్ష్యం కనిపించిందన్నారు. 21 రోజుల గడువు దాటినా బిల్డింగ్ పర్మిషన్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని అనధికార నిర్మాణాలపై వచ్చి 54 ఫిర్యాదులు ఎలాంటి చర్యలు లేకుండానే ఉండిపోయాయన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు 4,638 పెండింగ్‌లో ఉండగా సుమారు రూ.15కోట్లు వసూలు కాకుండా ఉన్నాయని కార్యాలయంలో క్యాష్ రిజిస్టర్ నిర్వహణ కూడా లేదని చెప్పారు. హాజరు రిజిస్టర్‌లో క్యాష్ రిజిస్టర్ నిర్వహణ కూడా లేదని చెప్పారు. హాజరు రిజిస్టర్‌లో కొందరు ఉద్యోగులు గైర్హాజరైనట్లు ఉన్నప్పటికీ పూర్తి నెల జీతాలు తీసుకున్నట్లు రికార్డులు చూపుతున్నాయని మున్సిపల్ వినియోగానికి సంబంధించిన లాగ్ బుక్స్ నిర్వహించట్లేదని, ఒక నెలలో ఇంధనం కోసం రూ.19లక్షలు వాడినట్లుగా రికార్డులు చూపడం జరిగిందన్నారు. మిర్యాలగూడ మున్సిపాలిటీలో అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా ప్రభుత్వ ఆదాయానికి భారీగా నష్టం వాటిల్లడమే కాకుండా అధికారుల బాధ్యతారాహిత్యమైన అంశాలను ప్రభుత్వానికి నివేదికను సమర్పించి సంబంధిత మున్సిపల్ అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని సిఫారసు చేస్తామన్నారు.

# కమీషన్ల కోసమే రిజర్వాయర్ల నిర్మాణాలు

జూరాల నుండి కాకుండా శ్రీశైలంకు ఎందుకు మార్చారు?

తెలంగాణ రక్షణ సేన (టిఆర్ఎస్) పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



**ప్రజాపక్షం/షాద్‌నగర్/కొందుర్గు:** పాలకులు కమీషన్ల కోసమే రిజర్వాయర్ నిర్మాణాలు చేపట్టారే తప్పా రైతుల కోసం కాదని తెలంగాణ రక్షణ సేన (టిఆర్ఎస్) పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. శుక్రవారం రాత్రి రంగారెడ్డి జిల్లా జిల్లేడు చౌదరిగూడ మండల కేంద్రంలో పాలమూరు..రంగారెడ్డి ప్రాజెక్టు సాధన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ ఉమ్మడి పాలమూరు జిల్లాలో కృష్ణానది 300కిలో మీటర్లు ప్రయాణం చేస్తుందని, ఒక చుక్క నీరు కూడా ఈ ప్రాంత రైతులకు దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమం నీళ్ళకోసమే వచ్చిందనే విషయాన్ని నేతలు పూర్తిగా మరచిపోయారని వాపోయారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జూరాల ప్రాజెక్టు నుండి కృష్ణానది నీళ్ళను తీసుకోవాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిపాదన ఉందని వివరించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర వచ్చాక అప్పటి ముఖ్యమంత్రి కెసిఆర్ బేషజాలకు పోయి జూరాలను పక్కన పెట్టి శ్రీశైలం ప్రాజెక్టు నుండి తీసుకోవాలని డిజైన్లు మార్చి ప్రతిపాదనలు పెట్టారని తెలిపారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఉన్న ప్రాజెక్టులను 50శాతం పూర్తి చేసేందుకు రూ.33వేల కోట్లు ఖర్చు చేశారని గుర్తు చేశారు. కమీషన్ల కోసమే ఈ నిధులు ఖర్చు చేశారే తప్పా ప్రజల కోసం కాదనే విషయాన్ని గ్రహించాలని సూచించారు. 140మీటర్ల చానల్ నుండి కాకుండా కేవలం 50చానల్ నుండి నీరు తీసుకోవాలని ప్రతిపాదించడం ప్రజలను మోసం చేయడమేనని పేర్కొన్నారు. రిజర్వాయన్ నిర్మించడమే కాకుండా కాల్వలు ఎక్కడ తీశారో చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12ఏళ్ళు అవుతున్నా నేటికి ఉమ్మడి పాలమూరు జిల్లా పరిస్థితి అలాగే ఉందని పేర్కొన్నారు. లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్ ఎన్నికల హామీగానే చేస్తున్నారే తప్పా తట్టెడు మట్టి తీయలేదని విమర్శించారు. వచ్చే దసరా నాటికి లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్ పనులు చేపట్టకుంటే ఉమ్మడి పాలమూరు, రంగారెడ్డి జిల్లాల్లో పాదయాత్రలు చేస్తామని హెచ్చరించారు. అరకొరగా నిర్మించిన ప్రాజెక్టుల మోటర్లకు రూ.6వేల కోట్లు ఖర్చు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఈనెల 10వ తేదిన ప్రధానమంత్రి మోదీ వస్తున్న నేపథ్యంలో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించేందుకు కృషి చేయాలని లేనిపక్షంలో వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెప్పడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. టిఆర్ఎస్ అధికారంలోకి వస్తే 10లక్షల ఎకరాలకు సాగునీరు అందించడంతోపాటు కార్పొరేట్ స్థాయి విద్య, వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. కొత్తగా వచ్చిన టిఆర్ఎస్‌కు వచ్చే ఎన్నికల్లో అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నేతలు బీర్ల ఎల్లయ్య, శ్రీనివాస్, సీమల రమేష్, ముస్తాఫా, అల్లంపల్లి రాంకోటి, గణేష్, పాండురంగారెడ్డి, కుమ్మరి శ్రీనివాస్, శివశంకర్, సురేందర్ జీ, వెంకటరమణమూర్తి, శ్రీవాణి, విజయ్‌కిరణ్, జనార్ధన్‌లు పాల్గొన్నారు.



## రూ.8 వేల కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులను.. తెలంగాణకు అంకితం చేయనున్న మోదీ

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రానికి సుమారు రూ.8 వేల కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధాని నరేంద్ర మోదీ జాతికి అంకితం చేయనున్నారని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు తెలిపారు. హైదరాబాద్‌లోని సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఆదివారం నిర్వహించనున్న ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ సభ ఏర్పాట్లను రాంచందర్ రావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాయంత్రం 4.30 గంటలకు ప్రారంభమయ్యే సభకు భారీ స్థాయిలో ప్రజలు తరలివస్తారని తెలిపారు. సభా వేదిక నిర్మాణం, బారికేడ్లు, జనసమీకరణ, వసతి ఏర్పాట్లపై పార్టీ నాయకులు, అధికారులతో సమీక్ష నిర్వహించిన ఆయన, ఎండల దృష్ట్యా గ్రౌండ్ మొత్తాన్ని కవర్ చేసినట్లు తెలిపారు. కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి ఇప్పటికే ఏర్పాట్లను పరిశీలించినట్లు వెల్లడించారు. దేశ ప్రధానిగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రధాని మోదీ తొలిసారిగా తెలంగాణకు వస్తున్నారని, తాను రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఇదే తొలి పర్యటన అని రాంచందర్ రావు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే తెలంగాణకు రూ. 13 లక్షల కోట్ల నిధులు కేటాయించిందన్నారు. ఈ సభకు మహిళలు, యువత, మేధావులు, వృత్తి నిపుణులు సహా అన్ని వర్గాల ప్రజలు హాజరవుతున్నారన్నారు. సుమారు రెండు లక్షల మందితో భారీ జనసమీకరణ చేస్తున్నామని తెలిపారు. పోలీసులు శాంతిభద్రతలు పర్యవేక్షిస్తూ కార్యకర్తలకు సహకరించాలని కోరిన ఆయన, ఏర్పాట్లలో పాల్గొంటున్న కార్మికులు, పార్టీ శ్రేణులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# తుమ్మిడిహెట్టి పునరుద్ధరణకు ప్రజా ప్రభుత్వం కృషి

మంత్రులు జూపల్లి కృష్ణారావు, గడ్డం వివేక్



**ప్రజాపక్షం/కౌటాల/కాగజ్‌నగర్ :** సాగునీటి రంగానికి పూర్వ వైభవం తీసుకువచ్చే దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం అడుగులు వేస్తోందని రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. శుక్రవారం తుమ్మిడిహెట్టిని సందర్శించిన మంత్రులు ప్రాణహిత నదికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి జలహారతి ఇచ్చారు. ప్రాజెక్ట్ ప్రతిపాదిత ప్రాంతాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. బరాజ్ ఎత్తు, సాగునీటి పారుదల పనులు, అటవీ పర్యావరణ అనుమతులపై అధికారులతో చర్చించారు. అనంతరం మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ గత బిఆర్ఎస్ పాలకులు పక్కనబెట్టిన ప్రాణహిత ప్రాజెక్టుకు పునరుజ్జీవం పోయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కాళేశ్వరం పేరుతో లక్షల కోట్లు ఖర్చు చేసి ఖజానాకు గండి కొట్టారని విమర్శించారు. తుమ్మిడిహెట్టి నిర్మిస్తే విద్యుత్ ఖర్చు లేకుండా గ్రావిటీ ద్వారా సిర్పూర్, ఆసిఫాబాద్, బెల్లంపల్లి, చెన్నూరు రైతాంగానికి మేలు జరుగుతుందన్నారు. మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ గత ప్రభుత్వం కమిషన్ల కోసమే ప్రాజెక్టును తుమ్మిడిహెట్టి నుండి కాళేశ్వరానికి తరలించి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు అన్యాయం చేసిందని ఆరోపించారు. తుమ్మిడిహెట్టి నిర్మాణంతో మహారాష్ట్రకు ఎలాంటి నష్టం లేదని, త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. ఈ ప్రాజెక్టు విషయంలో మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించేలా తెలంగాణ బిజెపి ఎంపిలు, ఎమ్మెల్యేలు ప్రధాని నరేంద్ర మోదీపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, పాల్వాయి హరీష్ బాబు, కలెక్టర్ హరిత, ఎస్‌పి నిఖిత పంత్ తదితరులు పాల్గొన్నారు.

# భారత్‌లో ప్రతీ ప్రాంతం పవిత్రమైనది

ఐక్యతాభావంతో ముడిపడి ఉంది : మోదీ ఉద్ఘాటన

**న్యూఢిల్లీ :** భారతదేశంలోని ప్రతీ ప్రాంతం పవిత్రమైనదని, భౌగోళిక హద్దులు దాటిన ఒక ప్రత్యేకమైన ఏకత్వంతో అవి ముడిపడి ఉన్నాయ, తరచుగా విభజనలతో నిండి ఉండే ఈ ప్రపంచంలో ఈ ఐక్యతా స్ఫూర్తి గతంలో కంటే ఇప్పుడు మరింత ప్రాసంగికంగా ఉందని శుక్రవారం ప్రధానమంత్రి మోదీ పేర్కొన్నారు. భక్తుల కోసం సోమనాథ్ ఆలయాన్ని తిరిగి తెరిచిన 75 సంవత్సరాల సందర్భంగామోదీ సంతకం చేసిన ఒక వ్యాసంలో, గుజరాత్‌లో ఆలయాన్ని రక్షించడానికి తమ ప్రాణాలను అర్పించి, పదే పదే పునర్నించిన వారి పోరాటాలు ఎప్పటికీ మరిచిపోలేమని ప్రధాని అన్నారు. విభజనలతో నిండిన ఈ ప్రపంచంలో ఈ స్ఫూర్తి మునుపెన్నడూ లేనంత ప్రాంసగికంగా ఉందని, ప్రతీ భారతీయుడి హృదయంలో ఐక్యతా భావం, ఉమ్మడి నాగరిక చైతన్య సజీవంగా ఉన్నందున సోమనాథ్ కీర్తి శిఖరాగ్రాన నిలుస్తూనే ఉంటుందని మోదీ పేర్కొన్నారు. దీనికి నివాళిగా వెయ్యేళ్ల అసాధారణ ధైర్యాన్ని స్మరించుకుంటూ రాబోయే వెయ్యి రోజులు సోమనాథ్‌లో ప్రత్యేక పూజలు జరుగుతాయని ఆయన తెలిపారు. పూజలకు చాలామంది విరాళాలు ఇవ్వడం కూడా సంతోషంగా ఉందని కూడా మోదీ అన్నారు. ‘ఈ సమయంలో నాతోటి భారతీయులు అందరూ సోమనాథ్ యాత్రకు వెళ్ళాలని నేను కోరుతున్నాను. మీరు సోమనాథ్ తీరంలో నిలుచున్నప్పుడు దాని ప్రాచీన కీర్తిని ఆస్వాదించండి. మీరు భక్తిభావంతో ఉప్పొంగిపోవడమే కాకుండా మసకబారని అచంచలమైన నాగరిక స్ఫూర్తి సంబంధిత బలమైన స్పందనను కూడా అనుభూతి చెందుతారు’ అని మోదీ వివరించారు. సోమ్‌నాథ్ ఆలయంపై జరిగిన మొదటి దాడికి వెయ్యి సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా తాను 2026లో తాను సోమ్‌నాథ్ స్వాభిమాన్ పర్వ్ కోసం సోమ్‌నాథ్ వెళ్లానని , అప్పటి రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ చేతుల మీదుగా పునరుద్ధరించబడిన ఆలయం ప్రారంభోత్సవం జరిగిన 75 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా మే 11న తాను సోమ్‌నాథ్‌కు తిరిగి వస్తానని మోదీ తెలిపారు. లకులీశ, సోమసర్మన్ అనేవారు ప్రభాసను గొప్ప తత్వశాస్త్ర కేంద్రంగా తీర్చిదిద్దారని ప్రధానమంత్రి వివరించారు.

## బిజెపి, బిఆర్ఎస్‌లకు తెలంగాణలో స్థానం లేదు : ఆది శ్రీనివాస్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిజెపి, బిఆర్ఎస్ ఎన్ని కుప్పిగంతలు వేసినా, వీధి కొట్లాటలు చేసినా ఈ రెండు పార్టీలకు తెలంగాణలో స్థానం లేదని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. సిఎల్‌పిలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ రెండు పార్టీలు పైకి మాత్రమే పరస్పరం విమర్శించుకుంటాయని లోపల మాత్రం ఎప్పుడూ కలిసే ఉంటాయన్నారు. చట్టసభల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లును ఆమోదించి కేంద్రానికి పంపి ఏడాది అవుతున్నా కేంద్రం ఇప్పటివరకు స్పందించకపోవడం దారుణమన్నారు. హైదరాబాద్‌కు వస్తున్న ప్రధాని మోదీ ముందు దీనికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఒసి అయినా సిఎం రేవంత్ రెడ్డి బిసిల ప్రయోజనం కోసం పోరాటం చేశారని, మరి బిజెపిలోని 8 మంది ఎంపిలు ఇదే బిసిల కోసం ఏం చేశారో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ విభజనను ప్రధాని మోదీ అవహేళన చేయగా, బిజెపి ఎంపి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును పాకిస్తాన్ విభజనతో పోల్చుడమేమిటని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలకు బిజెపి నేతలు క్షమాపణ చెప్పాలని ఆది శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

